News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS చంద్రకాంత్

తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :151 | ఖమ్మం | బుధవారం, జూలై 16, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad


## శుభంగా భూమికి తిరిగొచ్చిన శుభాంశు శుక్లా కాలిఫోర్నియాలో స్పేస్ క్రాఫ్ట్ ల్యాండింగ్



- అంతరిక్షం నుంచి కాలిఫోర్నియాలో ల్యాండ్ అయిన శుభాంశు శుక్లా!
- శుభాంశుతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక
- 22 గంటల సుదీర్ఘ ప్రయాణం తర్వాత భూమిపైకి చేరిన నౌక
- ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు వ్యోమగాములు

వివరాలు 2లో..

## రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని మాకైతే తెలియదు.. మీకు తెలుసా?



- వీరసావర్కర్‌కు వ్యతిరేకంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పిటిషన్
- తన పిటిషన్ రాహుల్ గాంధీ చదివేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును కోరిన పిటిషనర్
- రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు పెట్టేందుకు న్యాయపరమైన అవకాశం ఉందన్న హైకోర్టు

వివరాలు 2లో..



# కరోనా సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లను తయారు చేశాం

- జీనోమ్ వ్యాలీతో ప్రపంచ స్థాయి ఖ్యాతి
- జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకు గుర్తింపు తెచ్చాయన్న ముఖ్యమంత్రి
- దేశంలోని వ్యాక్సిన్లలో 33 శాతం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నామని వెల్లడి
- ఇక్కడి వ్యాక్సిన్లను ప్రపంచ దేశాలకు సరఫరా చేశామన్న రేవంత్ రెడ్డి



"మేము కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలతో పోటీపడడం లేదు. ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నాం. 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేటలోని జీనోమ్ వ్యాలీలో 'ఐకర్ బయాలజిక్స్' కొత్త యూనిట్ భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి,

# బనకచర్లను పక్కన పెట్టండి

- ఆ ప్రాజెక్టును ముఖ్యమంత్రుల సమావేశ ఎజెండాలో చేర్చడానికి వీల్లేదు
- అభ్యంతరాలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు దీనిపై ఏ రకంగానూ చర్చించొద్దు
- కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ లేఖ



పర్యావరణ మదింపు కమిటీ, కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథార్టీ... ఇలా అన్ని సంస్థలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తిప్పి పంపడమే కాకుండా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి విరుద్ధంగా ఉన్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును ముఖ్యమంత్రుల సమావేశ ఎజెండాలో చేర్చడానికి వీల్లేదని, పక్కన పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. అనుమతులిచ్చే రాజ్యాంగ సంస్థలను పట్టించుకోకుండా సమావేశంలో పెడతామంటే కేంద్ర ప్రభుత్వం సొంతంగా ఏర్పాటు చేసిన రెగ్యులేటరీ యంత్రాంగాన్ని తక్కువ చేసి చూడటమేనని పేర్కొంది. భవిష్యత్తులో చట్టానికి భిన్నంగా చేయడానికి ఇది ఓ ఉదాహరణగా నిలిచిపోతుందని తెలిపింది. బుధవారం కేంద్ర జలశక్తి మంత్రి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో గోదావరి-బనకచర్ల ఎజెండాగా ఉంటుందని సోమవారం కేంద్ర జలశక్తి కార్యదర్శి నుంచి లేఖ వచ్చింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ ప్రాజెక్టును ఎజెండా నుంచి పక్కనపెట్టాలని కోరుతూ సోమవారం రాత్రే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కేంద్ర జలశక్తి కార్యదర్శికి లేఖ రాశారు. "అంతర్ రాష్ట్ర జల సమస్యలను చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేయడం మంచిదే. అయితే గోదావరి-బనకచర్లను

వివరాలు 2లో..

## దేశవ్యాప్తంగా ఇంటి నంబర్లు ఒకేలా ఉండాలి

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఉద్దేశాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పండి
- ఇది పౌరసత్వ తనిఖీ కాదని భరోసా కల్పించండి
- కేంద్ర ఎన్నికల సంఘానికి తెదేపా ప్రతిపాదనలు



ఓటర్ల జాబితా తనిఖీని బలోపేతం చేసేందుకు దేశవ్యాప్తంగా ఇంటి నంబర్లు ఒకే తరహాలో ఉండేలా చూడాలని తెలుగుదేశం పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించింది. ప్రస్తుతం బిహార్‌లో మొదలుపెట్టిన ఓటర్ల

వివరాలు 2లో..

# విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి

- ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారన్న కేటీఆర్
- రేవంత్ ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శ
- విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపాటు



వివరాలు 2లో..

# మల్లు భట్టివిక్రమార్కకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

- రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై రామచందర్ రావుపై ఆరోపణలు
- తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ అధ్యక్షుడి డిమాండ్
- లేదంటే రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక



వివరాలు 2లో..

# లెక్కలేనన్ని అక్రమాస్తులు

- ఏసీబీకి చిక్కుతున్న నీటిపారుదలశాఖ అధికారులు
- ఏఈ నుంచి ఈఎన్సీ వరకు ఎవరు చిక్కినా రూ.కోట్లలోనే..



నీటిపారుదల శాఖలో అవినీతి అధికారులు ఒక్కొక్కరుగా ఏసీబీ వలకు చిక్కుతున్నారు. అధికారులతోపాటు వారి కుటుంబ సభ్యులు, బినామీలు.. ఇలా ప్రతి ఒక్కరి వివరాలను పక్కా సమాచారంతో సేకరించి, పకడ్బందీగా దాడులు చేస్తోంది. ఏఈ నుంచి ఈఎన్సీ వరకు ఎవర్ని పట్టుకున్నా... రూ.కోట్లలో ఆదాయానికి మించిన ఆస్తుల చిట్టాలు బయటపడుతున్నాయి. కొద్దిరోజుల క్రితం పట్టుబడిన ఏఈ నికేశ్ మొదలుకొని తాజాగా చిక్కిన విశ్రాంత

వివరాలు 2లో..

# భారత 'డెంగ్ జియావో పింగ్'.. పీవీ

- ఆయన ఆర్థిక విధానాలు దేశ ముఖచిత్రాన్ని మార్చాయి
- ఆ ఫలాలనే ఇప్పుడు మనమంతా అనుభవిస్తున్నాం
- భారతరత్న పీవీ నరసింహారావు స్మారకోపన్యాసంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



"ఒకప్పుడు చైనాలో చేపట్టిన సంస్కరణల ఫలితంగా నేడు ఆ దేశం ఏ స్థాయికి చేరిందో మనం చూడొచ్చు. అలాగే పీవీ నరసింహారావు గొప్ప ఆర్థిక సంస్కరణలతో భారత్ భవిష్యత్తును సంపూర్ణంగా మార్చారు. వాటి ఫలాలను ఇప్పుడు మనమంతా అనుభవిస్తున్నాం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 1978లో చైనాలో డెంగ్ జియావో పింగ్ చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా ఆ దేశం ఎలా అభివృద్ధి పథంలో సాగుతుందో మన దేశంలో పీవీ కూడా అలాగే సంస్కరణలకు నాంది పలికారని తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయ మాజీ ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్ర నేతృత్వంలో ప్రధానమంత్రుల సంగ్రహాలయం నిర్వహిస్తున్న 'ప్రైమ్ మినిస్టర్స్ లెక్చర్ సిరీస్'లో భాగంగా మంగళవారం 'ది లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పీవీ నరసింహారావు' స్మారకోపన్యాసంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు.

వివరాలు 2లో..

జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు...

## భూసేకరణను అడ్డుకోవాలని వినతి




- కరేడు భూముల్లో సోలార్ పరిశ్రమ
- ఇటీవలే భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు

వివరాలు 2లో..

## ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా మాస్కోపై దాడి చేయగలవా?

- ఇటీవల ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ కాల్ సంభాషణ
- ట్రంప్ ప్రతిపాదనకు నో చెప్పిన పుతిన్!
- అనంతరం జెలెన్ స్కీతో ట్రంప్ కీలక చర్చలు!



వివరాలు 2లో..

# కరోనా సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లను తయారు చేశాం

- మొదటి పేజీ తరువాయి

పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొత్త యూనిట్ శంకుస్థాపన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "రాబోయే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యాచరణను అమలు చేస్తున్నాం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను అభివృద్ధి

చేయాలని కృషిచేస్తున్నాం. అందుకనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. చైనా ప్లస్ వన్‌గా తెలంగాణను తీర్చిదిద్దనున్నాం. ప్రపంచ దేశాలన్నీ కూడా భారత్ వైపు చూస్తున్నాయి. దేశంలోనూ తెలంగాణను పెట్టుబడుల్లో అగ్రభాగాన నిలపాలన్నది మా లక్ష్యం. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని కోరుతున్నా. ఫార్మా, లైఫ్‌సైన్సెస్, ఐటీ, ఈవీ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు మా ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని మాట ఇస్తున్నా.

**ప్రభుత్వాలు మారినా విధానాలు మారలేదు...**

2000 సంవత్సరంలో ప్రారంభించిన జీనోమ్ వ్యాలీ కారణంగా.. 25 ఏళ్లలో ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంది. ఇక్కడ స్థాపించిన పరిశ్రమలు, ఇక్కడ పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలు అహర్నిశలు కృషిచేయడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచంలోనే ఒక గుర్తింపు లభించింది. దేశంలోనే వ్యాక్సిన్ ఉత్పత్తిలో 33 శాతం, బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి అవుతున్నాయంటే.. ఇక్కడి పారిశ్రామికవేత్తలు ఎంత నిబద్ధతతో పనిచేస్తున్నారో అర్థమవుతుంది. జీనోమ్ వ్యాలీ నుంచే కొవిడ్ వ్యాక్సిన్లను తయారుచేసి.. ప్రపంచ దేశాలకు

ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలది. ప్రభుత్వాలు మారినా విధానాలు మారలేదు. పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయి. పరిశ్రమలకు ఇచ్చే అనుమతులు, ప్రోత్సాహకాలు, విధానపరమైన నిర్ణయాల విషయంలో మా ప్రభుత్వం మరింత సరళంగా ముందుకెళ్తుంది. ఈ దేశంలోకి.. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి వేగంగా పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# బనకచర్లను పక్కన పెట్టండి

- మొదటి పేజీ తరువాయి

ఈ సమయంలో ఎజెండాలో పెట్టడం మంచిదికాదు. ఈ పథకం గురించి అనేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి పలు దఫాలు వారి అభిప్రాయాన్ని తెలిపారు. భాగస్వామ్య రాష్ట్రాలతో చర్చించకుండా చేపట్టడం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014కు వ్యతిరేకం. పునర్విభజన చట్టం మేరకు కేంద్ర జలసంఘం, గోదావరి బోర్డు, కృష్ణా బోర్డు, ఎపెక్స్ కౌన్సిల్ అనుమతులు కావాలి. ఆంధ్రప్రదేశ్ సమర్పించిన ప్రీ ఫీజిబిలిటీ నివేదికలో కీలకమైన సమాచారం లేదు. నీటి లభ్యత, సాంకేతికంగా సాధ్యాలపై వివరాలు లేవు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నిపుణుల మదింపు కమిటీ(ఈఏసీ) తిరస్కరించడంతో పర్యావరణ అనుమతి రాలేదు.

**తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటిపై ప్రభావం**

బనకచర్ల ప్రతిపాదనతో పోలవరం ప్రాజెక్టు నిర్వహణ స్వభావం మారడంతో పాటు తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లుతుంది. పోలవరం ప్రాజెక్టుకే ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ముంపు సమస్యలు ఇప్పటివరకు తేలలేదు. పైగా ఈ అంశం కోర్టులో ఉండగా పోలవరానికి అనుసంధానంగా మరో ప్రతిపాదన తేవడం సరైంది కాదు. ఈ ప్రాజెక్టు గోదావరి జలాల్లో తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటిపై ప్రభావం చూపుతుంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదికను తిరస్కరించాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సీడబ్ల్యూసీని ఆదేశించాలి.

ముందుకెళ్లకుండా ఆపాలి

ఆంధ్రప్రదేశ్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సమర్పించకుండా చూడాలి. టెండర్ ప్రక్రియ సహా ఎలాంటి తదుపరి కార్యాచరణ లేకుండా ఆపాలి. అన్ని అభ్యంతరాలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఈ ప్రాజెక్టు గురించి ఏ రకంగాను చర్చించడానికి వీల్లేదు" అని లేఖలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు.

**పెండింగ్ అంశాలే లక్ష్యంగా...**

కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో చర్చించనుంది. బుధవారం ఆయన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులతో సమావేశం కానున్నారు. తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల, ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. గోదావరి-బనకచర్ల అంశం ఎజెండా నుంచి పక్కనపెట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్ర జలశక్తి కార్యదర్శిగా లేఖ రాయగా, కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను చర్చించి పరిష్కరించాలని ఉత్తమ్... కేంద్ర జలశక్తి మంత్రికి లేఖ రాశారు. ఇందులో పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలకు నీటికేటాయింపులు సహా అనేక అంశాలు ఉన్నాయి.

# లెక్కలేనన్ని అక్రమాస్తులు

- మొదటి పేజీ తరువాయి

ఈఎన్సీ మురళీధర్‌రావు వరకు అదే పరిస్థితి. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకంగా పనిచేసిన అధికారులు లెక్కలేనన్ని ఆస్తులు ఆర్జించినట్లు బయటపడుతుండటం గమనార్హం. ఇదే శాఖకు చెందిన పలువురు అధికారులపై ఏసీబీ నిఘా పెట్టినట్లు సమాచారం.

ప్రతినెలా పట్టుబడుతున్నారు..

**ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతినెలా పలువురు కీలకాధికారులు ఏసీబీకి చిక్కారు.**

**ఏప్రిల్ 26:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈఎన్సీ భూక్యా హరిరాం ఇంటిపై ఏసీబీ దాడి చేసింది. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం వాస్తవ ఆదాయం, వ్యయానికి మించిన ఆస్తుల లెక్క రూ.5.26 కోట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.వందల కోట్లలో ఉంటుందని అంచనా వేశారు.

**మే 31:** రెడ్‌హిల్స్‌లోని నీటిపారుదలశాఖ ఎస్ఈ కార్యాలయంలో రూ.లక్ష లంచం సొమ్ము పుచ్చుకుంటూ ఎస్ఈ బన్సీలాల్, ఏఈలు కార్తిక్, నికేశ్ చిక్కారు. నికేశ్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా... రూ.కోట్లలో అక్రమాస్తులు బహిర్గతమయ్యాయి.

ఏప్రిల్ 4న పటాన్‌చెరు ఇరిగేషన్ ఏఈఈ రవికిశోర్ రూ.లక్ష.. మే 9న సిరిసిల్ల డివిజన్-7 ఈఈ అర్రంరెడ్డి అమరనాథ్‌రెడ్డి రూ.60 వేల లంచం తీసుకుంటూ చిక్కారు.

**శ్రీధర్‌కు చెందిన వ్యవసాయ భూములు, విల్లాలు, భవనాలు...**

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం గోపాల్‌పూర్‌లో 3.39 ఎకరాలు... గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో 10 గుంటలు... వరంగల్ జిల్లా దుగ్గొండిలో 4.2 ఎకరాలు... శాయంపేట మండలం తారాపూర్‌లో 0.234 ఎకరాలు... కరీంనగర్ మండలం కమాన్‌పూర్‌లో 30 గుంటలు... హైదరాబాద్ శివార్లలోని కీసరలో 30 గుంటలు... మంచాల మండలం ఆగపల్లిలో 2.23 ఎకరాలు... దేవరయాంజాల్‌లో 1.03 ఎకరాలు... అన్నోజిగూడలో 1.02 ఎకరాలు

పెద్దపల్లి బసంత్‌నగర్‌లో 204.75 చదరపు గజాల్లో నిర్మించిన భవనం

మలక్‌పేటలో మూడంతస్తుల భవనం

శేరిలింగంపల్లి స్కైహైలో 4,545 చదరపు అడుగుల ఫ్లాట్ (మూడు కారు పార్కింగ్‌లు)

అమీర్‌పేట్ వాసవి ఎంపీఎం గ్రాండ్‌లో 1,580 చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్

తెల్లాపూర్ విజన్ ఉర్జిత్‌లో 4,550 చదరపు అడుగుల విల్లా

హనుమకొండ వడ్డేపల్లి భవానీనగర్‌లో 300 చదరపు గజాల్లో నిర్మించిన మూడంతస్తుల భవనం

# దేశవ్యాప్తంగా ఇంటి నంబర్లు ఒకేలా ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

జాబితా ప్రత్యేక సవరణను (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) మిగతా రాష్ట్రాలకు విస్తరించే ముందు దాని ఉద్దేశాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పాలని కోరింది. ఈ ప్రక్రియ పౌరసత్వ తనిఖీకి సంబంధించినది కాదని తెలియజేయాలని, ఈ మేరకు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించాలని కోరింది. ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను రాజకీయ పార్టీల ద్వారా నేరుగా తెలుసుకొనేందుకు గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమావేశమవుతున్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలు.. మంగళవారం తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కూన రవికుమార్, తెదేపా అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్నలతో భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా చేపట్టబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గురించి వారు కొన్ని సూచనలు చేశారు. ఎన్నికలకు ఆర్నెల్ల ముందే సవరణలు పూర్తిచేయాలని సూచించారు.

తెదేపా ప్రతినిధి బృందంతో సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్. చిత్రంలో కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి

తెదేపా సూచనలివి..

ఓటర్ల జాబితా తయారీలో లోపాలను గుర్తించడానికి ఏటా కాగ్ ఆధ్వర్యంలో థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలి. డూప్లికేషన్లు, వలసలు, చనిపోయినవారి ఎంట్రీలను గుర్తించడానికి ఏఐ ఆధారిత టూల్స్ ఉపయోగించాలి.

దేశవ్యాప్తంగా ఓటర్లందరికీ విశిష్ట ఓటరు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. వ్యక్తిగత గోప్యతను పాటిస్తూనే ఆధార్‌తో ఓటరు కార్డులను క్రాస్ వెరిఫికేషన్ చేయడానికి అనుమతివ్వాలి.

జాబితాల సవరణలో గుర్తింపు పొందిన అన్ని పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లను భాగస్వాములను చేయాలి. ముసాయిదాలను రియల్ టైమ్ వెరిఫికేషన్‌కు అవకాశమివ్వాలి.

జాబితాలో చేర్చిన, తొలగించిన వారి వివరాలు, అందుకు కారణాలను వెల్లడిస్తూ ఈసీఐ వెబ్‌సైట్‌లో జిల్లాల వారీగా ప్రకటించాలి. ఓటర్ల ఫిర్యాదులు, పరిష్కారాలను తెలుసుకోవడానికి రియల్ టైమ్ డ్యాష్‌బోర్డును అమల్లోకి తేవాలి.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఎన్నికల అధికారులపై చర్యలపై కాలపరిమితి ఉండాలి.

ఓటర్ల జాబితాకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న రాజకీయ ఫిర్యాదుల పరిష్కారానికి ఈసీఐ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో అంబుడ్స్‌మన్‌ను నియమించాలి.

తాజాగా ధ్రువీకరించిన జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారిని ప్రత్యేక కారణాలుంటే తప్ప మళ్లీ అర్హత ధ్రువీకరించుకోవాలని అడగొద్దు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. జాబితా నుంచి పేర్లు తొలగించాలనుకుంటే ముందస్తు విచారణ తప్పనిసరిగా చేపట్టాలి. ఓటరు జాబితాలో పేర్లపై ఫిర్యాదు చేసినప్పుడు ఆ ఆరోపణలను నిరూపించాల్సిన బాధ్యత ఈఆర్ఓ లేదంటే అభ్యంతరం పెట్టిన వ్యక్తులదే తప్ప, ఓటరుది కాకుండా చూడాలి.

సమావేశంలో తెదేపా ప్రతినిధులు జ్యోత్స్న, బైరెడ్డి శబరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్లా శ్రీనివాసరావు, కూన రవికుమార్, దగ్గుమళ్ల ప్రసాదరావు

ఆంధ్రప్రదేశ్‌లో సీజన్ల వారీగా వలసలు ఉంటాయి. అందువల్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టేటప్పుడు మొబైల్ బీఎల్ఓ యూనిట్లను మోహరించాలి. వలస కార్మికులు, నిర్వాసిత కుటుంబాలను జాబితా నుంచి తొలగించకుండా ఉండేందుకు వారి తాత్కాలిక చిరునామాలను పరిగణనలోకి తీసుకోవాలి.

ఏ ఓటరు పేరునైనా తొలగించేటప్పుడు అందుకు కారణాలు చెప్పాలి. తగిన నోటీసు ఇవ్వాలి. బాధితుల అభిప్రాయం వినేందుకు అవకాశమివ్వాలి. ఎన్నికల సిబ్బంది తనిఖీకి వచ్చినప్పుడు ఎవరైనా డాక్యుమెంట్లు సమర్పించలేకపోతే వారికి దశల వారీగా అవకాశం ఇవ్వాలి' అని తెదేపా ప్రతినిధి బృందం సూచించింది. అనంతరం తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తాము చేసిన సూచనల అమలుకు ఈసీ సానుకూలత వ్యక్తం చేసిందన్నారు. ఓటరు జాబితాల సవరణ సమయంలో 11 డాక్యుమెంట్లను పరిగణనలోకి తీసుకుంటామని, అందువల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చారన్నారు. డూప్లికేషన్లను తొలగించే ప్రయత్నం తప్పితే ఎవరినీ తొలగించడానికి తాము ప్రయత్నించడం లేదని తెలిపారన్నారు.

# భారత 'డెంగ్ జియావో పింగ్'.. పీవీ

- మొదటి పేజీ తరువాయి

'భారతరత్న' మాజీ ప్రధాని పీవీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గొప్ప రాజనీతిజ్ఞుడు, దార్శనికుడైన పీవీ నరసింహారావు దేశ గతిని మార్చిన తెలుగుబిడ్డ అని అభివర్ణించారు. 17 భాషల్లో అనర్గళంగా మాట్లాగలిగిన మేధావి పీవీ అని.. కానీ మనం ఇప్పుడు హిందీ ఎందుకు నేర్చుకోవాలని అడుగుతున్నామని అన్నారు.

**సంస్కరణల సాహసి పీవీ**

"1991లో భారత్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో.. సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహిస్తూనే పీవీ ఎంతో ధైర్యంగా, అత్యంత సాహసోపేతంగా ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు. సాహసోపేతమైన సంస్కరణలకు వెళ్లాలని నిర్ణయించారు. దేశంలో చారిత్రక ఆర్థిక సంస్కరణలకు తెరతీశారు. తద్వారా భారత్ భవిష్యత్తును సంపూర్ణంగా మార్చారు. అందుకే పీవీ నరసింహారావును నేను భారత డెంగ్ జియావో పింగ్‌గా అభివర్ణిస్తున్నా" అని చంద్రబాబు పేర్కొన్నారు. "దానికి తోడు ఐటీని అందిపుచ్చుకోవడం, డెమొగ్రఫిక్ డివిడెండ్‌ల కారణంగా భారత్ ముందడుగు వేయడం ప్రారంభించింది. పీవీ తర్వాత ప్రధాని అయిన అటల్ బిహారీ వాజపేయీ కూడా సంస్కరణలు ముందుకు తీసుకెళ్లి దేశంలో మౌలిక వసతులు, టెలికం విప్లవానికి బలమైన పునాదులు వేశారు. అప్పట్లో ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన సేవలను కూడా ఎవరూ మరిచిపోలేరు. అలాగే ప్రధాని నరేంద్రమోదీ డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ విధానాలను అమల్లోకి తెచ్చారు. అందుకు ఆయనకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నా. గత దశాబ్దకాలంలో 11 కోట్ల మంది భారతీయులను కడు పేదరికం నుంచి బయటికి తీసుకురావడం నరేంద్రమోదీ విజయానికి నిదర్శనం.

## శుభంగా భూమికి తిరిగొచ్చిన శుభాంశు శుక్లా కాలిఫోర్నియాలో స్పేస్ క్రాఫ్ట్ ల్యాండింగ్

భారత వ్యోమగా మి శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకు న్నారు. వీరు అంతరిక్షంలో 18 రోజులు గడిపిన అనంతరం 22 గంటల సుదీర్ఘ ప్రయాణం చేసి భూమిపై దిగారు. కాలిఫోర్నియా సమీపంలోని సముద్రంలో నలు గురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక దిగింది. వారిని ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు వారు భూమిని చేరారు. జూన్ 25న అంతరిక్షంలోకి వెళ్లిన శుభాంశు బృందం అక్కడ పలు కీలక పరిశోధనలు నిర్వహించింది. ఈ 18 రోజుల్లో వీరు దాదాపు 96.5 లక్షల కిలోమీటర్లు ప్రయాణించారు. శుభాంశు శుక్లా 60కి పైగా శాస్త్రీయ పరిశోధనల్లో పాల్గొన్నారు. అంతరిక్షంలో ఉన్న సమయంలో ఈ బృందం 230 సూర్యోదయాలను చూసింది.

## విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి

రాష్ట్రంలో విద్యార్థుల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు రేవంత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో వేలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్ తో అనారోగ్యం పాలయ్యారని, వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కూడా ఆయన చేతిలోనే ఉన్నప్పటికీ ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు.

కనీసం ఒక తండ్రిగానైనా రేవంత్ స్పందించాలని... పిల్లలు కలిగిన ఒక తండ్రిగా కోరుతున్నానని కేటీఆర్ అన్నారు. మీ పిల్లలకు విషం కలిపిన ఆహారాన్ని ప్రభుత్వం పెడితే మీరు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని... తగిన సమయంలో తీర్పు ఇస్తారని చెప్పారు.

## ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా మాస్కోపై దాడి చేయగలవా?

ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మా ర్చుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా శాంతి మంత్రం జపించిన ట్రంప్... ఇకపై రష్యాను ఒత్తిడి లోకి నెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్టు తాజా పరిణామాలు చెబుతున్నాయి. జులై 4న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీతో జరిగిన ఒక ప్రైవేట్ సంభాషణలో, అవసరమైన ఆయుధాలు అందిస్తే మాస్కో మరియు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లతో సహా రష్యా లోపల దాడులను తీవ్రతరం చేయగలరా? అని ట్రంప్ ప్రశ్నించినట్లు ఓ కథనం వచ్చింది.ఆ కథనం ప్రకారం... రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ ఫోన్ కాల్ సంభాషణ తీవ్ర నిరాశాజనకంగా ముగిసిన తర్వాత జెలెన్‌స్కీతో ఈ చర్చ జరిగింది. కాల్పుల విరమణ చర్చలకు రష్యా నిరాకరించడంపై అమెరికాలో పెరుగుతున్న అసంతృప్తిని ఇది సూచిస్తోంది. రష్యాను నేరుగా ఎదుర్కోవడానికి వెనకడుగు వేస్తారన్న ట్రంప్ మునుపటి అభిప్రాయానికి ఇది భిన్నమైన వైఖరిగా భావిస్తున్నారు. రష్యన్లకు ఏదో విధంగా బాధ కలిగించి, వారిని చర్చలకు రప్పించడమే ట్రంప్ కొత్త వ్యూహమని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా దీర్ఘ శ్రేణి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందిస్తుందా లేదా అనేది స్పష్టంగా తెలియకపోయినా, రష్యా భూభాగంపై మరింత దూకుడు దాడులకు పాశ్చాత్య దేశాలు, మరియు అమెరికా విధాన రూపకర్తలలో మద్దతు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు కొత్త ఆయుధాలను అందిస్తామని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడం, అలాగే 50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యా ఎగుమతుల కొనుగోలుదారులపై ఆంక్షలు విధిస్తామని బెదిరించడం వంటి పరిణామాలు మాస్కో మొండి వైఖరి కారణంగానే చోటుచేసుకున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

## రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని మాకైతే తెలియదు.. మీకు తెలుసా?

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని మాకు తెలియదు, మీకేమైనా తెలుసా? అని పిటిషనర్‌ను బాంబే హైకోర్టు ప్రశ్నించింది. వీర సావర్కర్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఒక వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. రాహుల్ గాంధీ తన పిటిషన్ కాపీని చదవాలనే ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ బాంబై హైకోర్టును కోరారు.అయితే, మీ పిటిషన్‌ను చదవమని రాహుల్ గాంధీని ఎలా బలవంతం చేస్తారని హైకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది.ప్రతిపక్షంలో ఉన్న రాహుల్ గాంధీ గందరగోళం సృష్టిస్తున్నారని, ఒకవేళ ఆయన ప్రధానమంత్రి అయితే విధ్వంసం సష్టిస్తారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఆయన ప్రధాని అవుతారని మీకు తెలుసా అంటూ ప్రశ్నించింది.అదే సమయంలో, రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు పెట్టేందుకు పిటిషనర్‌కు న్యాయపరమైన అవకాశం ఉందని పేర్కొంది. ఈ అంశంపై సావర్కర్ మనవడు పుణే కోర్టును ఆశ్రయించగా, అక్కడ దీనిపై విచారణ జరుగుతుందని న్యాయస్థానం గుర్తు చేసింది. దీనిపై సుప్రీంకోర్టులో కూడా విచారణ జరిగిందని, అక్కడ ఆ పిటిషన్‌ను కొట్టివేశారని తెలిపింది. 2022లో మహారాష్ట్రలో రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సావర్కర్ బ్రిటిష్ సేవకుడని ఆరోపించారు. బ్రిటిష్ నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో దుమారం రేపాయి. దీంతో సావర్కర్ మనవడు పుణే కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, విచారణ కొనసాగుతోంది.

## మల్లు భట్టివిక్రమార్కకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు లీగల్ నోటీసులు పంపించారు. రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టివిక్రమార్క చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయన తరపు న్యాయవాది విజయ్‌కాంత్ ద్వారా ఈ నోటీసులు పంపించారు.తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు మల్లు భట్టివిక్రమార్క మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. క్షమాపణ చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా పేర్కొన్నారు.

## జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు... భూసేకరణను అడ్డుకోవాలని వినతి

నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో తమ సారవంతమైన భూములను ఇండోసోల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న రైతులు మంగళవారం నాడు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌ను కలిశారు. సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండే తమ సంట భూములను సోలార్ పరిశ్రమకు ఇవ్వకుండా నిలుపుదల చేయాలని కోరుతూ జగన్‌కు వినతిపత్రం అందజేశారు.రైతుల సమస్యలను సావధానంగా విన్న జగన్, అన్నదాతలకు వైసీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, భూముల పరిరక్షణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ ఇచ్చిన హామీతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కరేడు గ్రామ రైతులు గత కొంతకాలంగా తమ భూములను ఇండోసోల్ పరిశ్రమకు కేటాయించడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వడంతో వారు భగ్గుమన్నారు. అప్పటినుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే వారు జగన్ ను కలిశారు. జగన్ ను కలిసిన సమయంలో రైతుల వెంట కందుకూరు అసెంబ్లీ స్థానం వైసీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కూడా ఉన్నారు.ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. "రెండు మూడు నెలలుగా ఈ భూముల గురించి రైతులు పోరాడుతున్నారు.

# భద్రాద్రిలో తెలుగు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం.





- అధ్యక్షులుగా -తాళ్లూరి చిట్టిబాబు, ఉపాధ్యక్షులు- రేపాక రాంబాబు,
- భద్రాచలం తెదేపా నూతన పట్టణ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),జూలై 15,** తెలుగుదేశం పార్టీ భద్రాచలం నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం గోదావరి ఫంక్షన్ హాల్ లో జరిగినది ఈ సమావేశానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నియమించిన భద్రాచలం నియోజకవర్గం పరిశీలకులు వట్టం నారాయణ దొర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు పోటు రంగారావు, కొడాలి శ్రీనివాస్ , కుంచాల రాజారాం, కంభంపాటి సురేష్ , పిల్లంటి దేశప్ప, అభినేని శ్రీనివాస్ , సీనియర్ నాయకులు శ్రీనివాస్ , వాసిరెడ్డి చలపతిరావు, నూతలపాటి దాసయ్య, పాల్గొన్నారు, తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ కూటమితో తెలంగాణ రాష్ట్రంలో అధికారాని కి రావడం ఖాయం, భద్రాచలం నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ ప్రతి గ్రామంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజలకు ప్రయోజనకరంగా ఉన్నాయి, ప్రతి కార్యకర్త ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి రెండు దశాబ్దాలుగా అధికారం లేకపోయినా పార్టీకి కట్టుబడి ఉండటం తెలుగుదేశం పార్టీ కుటుంబానికి మాత్రమే చెందుతుంది, అంతటి క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తలు అదే క్రమశిక్షణ తో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు, ఈ సమావేశం అనంతరం భద్రాచలం తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ని పరిశీలకులు వట్టంనారాయణ దొర సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సుఫారి కిల్లర్లతో భర్తను చంపించిన భార్య







**సీకే న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**యాదాద్రి జిల్లాలో దారుణం జరిగింది ఓ భార్య తన ప్రియుడితో కలిసి భర్తను చంపించింది స్వామి అనే వ్యక్తి ప్రమాదంలో మరణించాడు పోలీసులు మృతుడి భార్యను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ప్రియుడితో ప్లాన్ చేసి భర్తను హత్య చేయించినట్లు ఒప్పుకున్నది సుపారి కిల్లర్లతో కారుతో స్వామి ప్రయాణిస్తున్న బైకును వెనకాల నుండి ఢీ కొట్టించి ప్రాణాలతో ఉండటంతో మళ్ళీ దాడి చేసినట్లు గుర్తించారు వివాహేతర సంబంధమే భర్త హత్యకు కారణమని తెలిసింది

## విద్యుత్తు షాక్ తో యువకుడు మృతి



**జులై 15 (సీ కే న్యూస్) చేగుంట :**చేగుంట మండల్ ఇబ్రహీంపూర్ గ్రామంలో విషాద ఛాయలు వివరాలోకి వెళితే మరిపల్లి శ్రీనివాస్ వయస్సు (35) ఇతను ప్రస్తుతం తూప్రాన్ ఆర్డిఓ ఆఫీసు లో రికార్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు,మంగళవారం నాడు ఉదయం తన సొంత బోరు వద్ద నాటు వేస్తున్న సందర్భంగా బోర్ మోటార్ నడవకపోవడంతో స్టార్టర్ వద్ద రిపేరు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు మృతుడికి భార్య రమ్య, కుమారులు దీక్షిత్, భరత్, ఉన్నారు కుటుంబ సభ్యులు సమాచారం మేరకు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశిలించారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు,

## భద్రాచలం ఏజెన్సీలో అధిక ఫీజులు నియంత్రించాలి.

- విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి...
- జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలు 50% ఫీజులు రాయితీ ఇవ్వాలి...
- మానవహక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారికి వినతి పత్రం...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూలై 15,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం లో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు కార్పొరేట్ స్థాయి ఫీజులను అధికంగా వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని జాతీయ వినియోగదారులు మరియు మానవ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చెట్టి జస్వంత్ భద్రాచలం విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా చెట్టి జస్వంత్ మాట్లాడుతూ భద్రాచలంలో కార్పొరేట్ స్కూల్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్య చట్టాలను కాలగర్భంలో కనిపిస్తున్నారని అన్నారు, అంతేకాకుండా భద్రాచలంలో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆ చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 25% ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలు ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు, మరీ ముఖ్యంగా భద్రాచలం ఏజెన్సీలో నిత్యం సమాజం కోసం శ్రమిస్తూ నాలుగవ స్తంభం లా పనిచేసే జర్నలిస్టుల పిల్లలకు జిల్లా విద్యాశాఖ అధికారి ఇచ్చిన ఆదిదేశాలనుసారం ప్రైవేట్ పాఠశాలలు ఫీజులలో 50% రాయతీ కల్పించాలని, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు ఇచ్చినా కూడా చాలామంది ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో జాతీయ వినియోగదారులు మరియు మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పోరాటాలు తప్పవని ఈ సందర్భంగా తెలియజేశారు.

## రక్తదానం చేయండి జీవితాలను కాపాడండి.



జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),జూలై 15,**యువత రక్తదానం ను ఆదర్శంగా తీసుకొని రక్తదానం చేసి జీవితాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నేతృత్వంలో జిల్లా రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో కొత్తగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణంలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత రక్త పరీక్ష శిబిరంలో పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రజలు తమ యొక్క బ్లడ్ గ్రూప్ తెలుసుకోవడం సులభతరం అవుతుందన్నారు. దీని ద్వారా అత్యవసర సందర్భాల్లో రక్తదానం చేసేందుకు సులభంగా ఉంటుందని, అత్యవసర సమయంలో ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందని కావున ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున ఈ ఉచిత రక్త పరీక్ష శిబిరం ని ఉపయోగించుకొని తమ యొక్క బ్లడ్ గ్రూపు వివరాలను తెలుసుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత రక్తదానం కార్యక్రమం ఆదర్శంగా తీసుకొని ఆపద కాలంలో రక్తదానం చేసి జీవితాలను నిలబెట్టాలని కలెక్టర్ కోరారు. ఈ రక్త పరీక్ష తేదీ కేంద్రంలో తాను కూడా రక్తపరీక్ష చేయించుకున్నానని అత్యవసర సమయంలో రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్నానని కలెక్టర్ తెలిపారు. ఈ ఉచిత రక్త పరీక్ష శిబిరం ద్వారా తమ బ్లడ్ గ్రూపు ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఇలా తెలుసుకోవడం ద్వారా ఎదుటి వ్యక్తికి సహాయం చేయడమే కాకుండా తన యొక్క బ్లడ్ గ్రూప్ పై అవగాహన ఉండటం స్వీయ సంరక్షణకు కూడా ఉపయోగపడుతుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు తమ యొక్క బ్లడ్ గ్రూప్ సంబంధిత వివరాలను తప్పని సరిగా తెలుసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీవో వెంకటరమణ,మనోహర్, వెంకట పుల్లయ్య, డీఎస్పీ రెహమాన్, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, ఆటో డ్రైవర్లు మరియు కార్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు

## సిఎంఆర్ఎఫ్ నిరుపేద ప్రజలకు ఓ వరం

దుబ్బాక కాంగ్రెస్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి





**జులై 15 (సీ కే న్యూస్) చేగుంట :**చేగుంట మండల సంబంధించిన (4,50,000 ) నాలుగు లక్షల యాభై వేల రూపాయల, సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి 16 మంది లబ్ధిదారులకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ చేగుంట లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ మాజీ ఎఎంసి చైర్మన్ రజనకు ప్రవీణ్ కుమార్, ప్యాక్స్ ఛైర్మన్ మ్యకాల పరమేష్, మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మోజమిల్, బాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు అన్నం ఆంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్టాలిన్ నర్సింలు, మైనారిటీ సెల్ తయాబ్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్,అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బోల్ల ప్రశాంత్, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ కార్యదర్శి సాయి కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ రాంపూర్ కాశబోయిన భాస్కర్,మాజీ సర్పంచ్ జగన్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాల సురేష్, మద్దూరి రాజు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిత పరంజ్యోతి, జూకంటి రాజా గౌడ్, కౌంశెట్టి సతీష్, యువ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్, జింక శ్రీనివాస్, రాజీ రెడ్డి, బాల్ నర్సయ్య, నలిన్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు కురుమ లక్ష్మి వివిధ గ్రామ కాంగ్రెస్ అద్యక్షులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## అధ్వానంగా ఉన్న పెవిలియన్ గ్రౌండ్ పట్టించుకోని నగర పాలక సంస్థ



**సి కె న్యూస్ ప్రతినిధి:**నగర పాలక సంస్థ పెవిలియన్ మైదానాన్ని ఎగ్జిబిషన్ కు అద్దెకు ఇచ్చిందని ఎగ్జిబిషన్ గడువు ముగిసి రెండు నెలలు అయినా నేటికీ పెవిలియన్ గ్రౌండ్ మైదానం అపరిశుభ్రంగా తయారై నడక సాదకులకు ఇబ్బంది కారంగా తయారైందని పెవిలియన్ గ్రౌండ్ ఖమ్మం నగర పాలక సంస్థ ఆదినంలో ఉన్నదని రోజు వందలాది మంది ఆరోగ్యాలు కాపాడుకునేందుకు ఉదయం సాయంత్రం పెవిలియన్ గ్రౌండ్ నందు అనేక రకాల వ్యాయామాలు, వాకింగ్, ఓపెన్ జిమ్ లాంటి సాదనలు చేస్తున్నారని అటువంటి పెవిలియన్ గ్రౌండ్ ఈరోజు ఇలా అధ్వానంగా తయారు కావడాన్ని నగర పాలక సంస్థ పట్టించుకోక పోవడాన్ని నడక సాదకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పెవిలియన్ గ్రౌండ్ పరిశుభ్రత పట్ల అలసత్వం ప్రదర్శిస్తోందని నగర పాలక సంస్థ పెవిలియన్ గ్రౌండ్ నుండి ఆదాయాన్ని చూస్తుందే కానీ పెవిలియన్ గ్రౌండ్ శుభ్రత విస్మరిస్తుందని పెవిలియన్ గ్రౌండ్ మైదానంలో వృధాగా పడిఉన్న వ్యర్థ పదార్థాలు ఉండడంతో దుర్గంధం వస్తుందని వ్యర్థ పదార్థాలు అటువంటి వ్యర్థ పదార్థాలు తొలగించడం లేదని నడక సాదకులు ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ పెవిలియన్ గ్రౌండ్ పై దృష్టి సారించి నగర ప్రజలైన నడక సాదకులకు ఉపయోపడే మైదానాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఉండేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని, తక్షణమే పెవిలియన్ గ్రౌండ్ నందు అధ్వానంగా మైదానం మొత్తం అస్తవ్యస్తంగా పడిఉన్న ఎగ్జిబిషన్ వారి పరికరాలు తొలగించి నడక మరయు వివిధ రకాల వ్యాయామాలు చేసుకునే వారికి సహాకరించాలని నగర పాలక సంస్థను కోరారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ నడక సాదకులు మంద వెంకటేశ్వర్లు, రావూరి.శ్రీనివాస్ రావు, గంగారపు వీరభద్రం, పాటి.శ్రీనివాస్ రావు, తమ్మినేని రంగారావు, కొండమీది వెంకట్, మేడికల్, వెంకట్, పెద్దపల్లి దుర్గారావు, నెల్లూరి అత్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్స్ సమస్యలపై కలెక్టర్ కు ఐద్వా వినతి

- జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్స్ 75 నుంచి 150 కి పెంచాలి
- 6 పడకల దవాఖానలను 50 బెడ్స్ కు విస్తరించాలి
- ఆసుపత్రుల్లో సరిపడా డాక్టర్లు, ఇతర సిబ్బందిని నియమించాలని డిమాండ్

**సి కె న్యూస్ ప్రతినిధి :** ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ఖమ్మం జిల్లా కమిటీ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి కలెక్టరేట్ లో మంగళవారం వినతిపత్రం సమర్పించింది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సమస్యలపై ఓ సర్వే నిర్వహించినట్లు తెలిపింది. దీనిలో భాగంగా 12 పి.హెచ్.సి.లు, 4 సబ్ సెంటర్స్, 2 ఏరియా హాస్పిటల్స్ ను ప్రత్యక్షంగా సందర్శించామని..ఆయా ఆసుపత్రిల్లోని సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఐద్వా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రిలో బెడ్స్ కొరత చాలా తీవ్రంగా ఉన్నదని, 150 పడకలు అవసరం ఉండగా ప్రస్తుతం 75 మాత్రమే ఉన్నాయని తెలిపింది. సరిపడా లేకపోవడంతో ఒక్కో బెడ్ పై ఇద్దరు చొప్పున పేషెంట్లు పడుకుంటున్న దుస్థితి ఉందని పేర్కొంది. కొన్ని సందర్భాల్లో బెడ్స్ సరిపోకపోవడంతో కింద కూడా పడుకుంటున్నారని తెలిపింది. జిల్లా ఆసుపత్రిలో లాపరోస్కోపి సెంటర్ లేదు, ఒక్కరే పర్మినెంట్ డాక్టర్ ఉన్నారని, తక్షణమే ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలి కోరింది. శానిటరీ సిబ్బంది కూడా లేకపోవడం వలన ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపింది. సర్వే చేసిన అన్ని సెంటర్స్ లో సరిపడా డాక్టర్స్ లేరని, వైద్య పరికరాలు లేవని, మంచినీటి సౌకర్యం, బాత్రూమ్స్ లేవని తక్షణమే పర్మనెంట్ డాక్టర్స్, ఇతర వైద్య సిబ్బందితో పాటు అన్ని సెంటర్స్ 6 పడకల ఆసుపత్రులుగానే ఉన్నాయని.. తక్షణమే వీటిని 50 పడకలకు పెంచాలని కోరింది.

నేలకొండపల్లి, వైరా రూరల్, పాలడుగులో ఆసుపత్రి బిల్డింగులు శిథిలావస్థలో ఉన్నాయని, మేడేపల్లి, వెంకటాపురం, ముదిగొండ, వల్లభిలలో అద్దె భవనాలలో ఆసుపత్రులు నడుస్తున్నాయని, అన్ని ఆసుపత్రులకు సొంత భవనాలు నిర్మించాలని, మధిర సబ్ సెంటర్ ఆసుపత్రికి ప్రహరీ గోడ లేకపోవడంతో పాములు, విష కీటకాలు చేరుతున్నాయని.. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. కారేపల్లి, తల్లాడ మండలాల జనాభా 50 నుండి 60 వేల వరకు ఉందని, ఇక్కడ కేవలం ఒక్కో పి.హెచ్.సి. మాత్రమే ఉన్నాయని, వీటిని 2 పి.హెచ్.సి.లకు పెంచాలని కోరింది. జనాభా ప్రాతిపదికన అన్ని మండలాల్లో పి.హెచ్.సి.లు ఏర్పాటు చేయాలని, ఖమ్మం టౌన్ రిక్కాబజార్ బస్తీ దవాఖానలో ఎటువంటి సౌకర్యాలు లేవని, వైద్యులు ఏ సమయంలో ఉంటారో ఎటువంటి సమాచారం ఉండటం లేదని, హవేలీ మండల సబ్ సెంటర్లో 15 ఏళ్లుగా కరెంటు లేకపోవడంతో పేషెంట్స్, డాక్టర్స్, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కూర్చోవడానికి బల్లలు కూడా లేని దుస్థితి ఉందని ఐద్వా పేర్కొంది. ఆస్పత్రుల్లోని సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించిన వారిలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు మెహరున్నీసాబేగం, జిల్లా కమిటీ సభ్యులు బాగం అజిత తదితరులు పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ తోటల్లో డ్రిప్ సౌకర్యం యుద్ధ ప్రాతిపదికన కల్పించాలి.....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఆగస్టు 15 నాటికి ఆయిల్ పామ్ ప్లాంటేషన్ నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలి
- కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆయిల్ పామ్ పంట సాగు, డ్రిప్ సౌకర్యం ఏర్పాటుపై సమీక్షించిన జిల్లా కలెక్టర్




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూలై -15:** ఆయిల్ పామ్ తోటల్లో డ్రిప్ సౌకర్యం యుద్ధ ప్రాతిపదికన కల్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, ఆయిల్ పామ్ సాగు, డ్రిప్ సౌకర్యం ఏర్పాటుపై సంబంధిత అధికారులతో మంగళవారం సాయంత్రం సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత సీజన్ లో ఇప్పటి వరకు 4472 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసామని, 2522 ఎకరాలలో మొక్కలు నాటితే 931 ఎకరాలలో మాత్రమే డ్రిప్ ఏర్పాటు కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆయిల్ పామ్ సాగుకు మొక్కలు నాటిన తర్వాత డ్రిప్ ఏర్పాటు ఆలస్యం కాకుండా చూడాలని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ ఏర్పాటు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, వారం రోజులలో పురోగతి కనిపించని పక్షంలో వేరే కంపెనీలకు అవకాశం కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఆగస్టు 15 నాటికి జిల్లాకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని, ఆయిల్ పామ్ ప్లాంటేషన్ తో పాటు డ్రిప్ ఏర్పాటుకు సమాంతరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు.

జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం అనుగుణంగా ఒకే కంపెనీపై ఆధారపడకుండా పలు కంపెనీల ద్వారా త్వరగా మన రైతుల పొలాల్లో డ్రిప్ సౌకర్యం ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఆయిల్ పామ్ రైతులకు అవసరం ఉన్న చోట విద్యుత్ లైన్స్ షిఫ్టింగ్ పనులు వేగవంతం చేయాలని అన్నారు. విద్యుత్ లైన్ షిఫ్టింగ్ కోసం రైతులు డబ్బులు చెల్లించిన సత్వరమే పని జరిగేలా చూడాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, హార్టికల్చర్ అధికారిణి అనిత, ఏడిఏ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం అమలు చేయాలి..

తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేసిన..ఏ ఐ టీ యూ సీ



**సి కే న్యూస్ ఎమ్మిగనూరు టౌన్, జూలై 15,**ఎమ్మిగనూరు పురపాలక శాఖ నందు పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికుల వారి పిల్లల కు తల్లికి వందనం అమలు చేయాలని,జీవో నెంబర్ 26 ప్రకారం పారిశుద్ధ కార్మికులు సంక్షేమ పథకాలకు అర్హులని కార్మికుల పిల్లలకు అమలు చేయాలని కోరుతూ ఏ ఐ టీ యూ సీ తాలూకా కార్యదర్శి తిమ్మ గురుడు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకృష్ణ ఎల్లప్ప ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ ఎ. శేషఫణి కి వినతి పత్రం ను అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం తల్లి ఖాతాకు డబ్బులు జమ చేయాలని కలిసినటువంటి పారిశుద్ధ తహసిల్దార్ గారికి ఏ ఐ టీ యూ సీ ఆధ్వర్యంలో కార్మికులు అలాగే రైస్ కార్డులో పిల్లలను ఎక్కించడానికి మార్పులు చేర్పులకు కూడా అవకాశం కల్పించాలని తల్లికి వందనం జీవో నంబర్ 26 జీవోకాపీని తహశీల్దార్ కు అందజేశామని తెలిపారు. ఎమ్మిగనూరు మునిసిపల్ పరిధిలో దశాబ్దాల కాలంగా పనిచేస్తున్నటువంటి మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో ఔట్సోర్సింగ్ కార్మికులను కూడా ఎంప్లాయిస్ గా చూపిస్తున్న%శీ%దువలన కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కాకపోతే విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. తక్షణమే తల్లికి వందనం ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఖలీల్, బాషా వీరేష్,రాజు,తిక్కయ్య,మార్టిన్ నాగూర్ షరీఫ్,ఆదాం,పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క అధికారి విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి......

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రభుత్వ కార్యాలయలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ప్రభుత్వ సిబ్బందికి తప్పనిసరిగా బయో మెట్రిక్ అటెండెన్స్ విధానం అమలు
- క్యాంటీన్ లో టీ త్రాగి, డబ్బులు చెల్లించిన జిల్లా కలెక్టర్
- సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**సి కె న్యూస్ ప్రతినిధి:**సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పని చేసే ప్రతి ఒక్క అధికారి, ప్రభుత్వ సిబ్బంది తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కార్మిక శాఖ, జిల్లా ఖజానా కార్యాలయం, భోజన శాల, కలెక్టరేట్ రెవెన్యూ విభాగం, ముఖ్య ప్రణాళిక అధికారి, ఉపాధి అధికారి, టూరిజం, డిఆర్డీవో, టౌన్ ప్లానింగ్, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, జిల్లా వైద్యారోగ్య శాఖ, భూ సేకరణ విభాగం, ఏడి డ్రగ్స్ కంట్రోల్, ఏడి మైన్స్, భూ సేకరణ, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాలను, రికార్డు రూములను, ఓపెన్ లాంజ్, టాయిలెట్స్, క్యాంటీన్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఉద్యోగుల భోజనశాల గదిలో త్రాగునీరు సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయాల్లో ప్రతి ఫైల్ పకడ్బందీగా రికార్డు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.

జిల్లా విద్యాశాఖ కార్యాలయ తనిఖీ లో భాగంగా విద్యా శాఖ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ గా తీసుకొని వంద శాతం అక్షరాస్యత సాధన దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ 10వ తరగతి ఓపెన్ స్కూల్ ద్వారా ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టి, సంపూర్ణ అక్షరాస్యత మండలంగా ప్రకటించేలా కార్యాచరణ చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఇటుక బట్టిలలో పని చేసే వారి పిల్లలకు తప్పనిసరిగా విద్య అందేలా చూడాలని అన్నారు. ప్రతి శాఖలో సిబ్బంది ఔట్ సోర్సింగ్, డిప్యూటేషన్ అధికారుల హాజరు కూడా బయో మెట్రిక్ ద్వారా తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మెడికల్ రియంబర్స్మెంట్ ఫైల్స్ సకాలంలో డిస్పోజ్ చేయాలని అన్నారు. ప్రతి వారం ప్రజావాణి దరఖాస్తుల స్టేటస్ తో పాటు ప్రతి శాఖలోని అధికారులు, సిబ్బంది హాజరు వివరాలు అందించాలని అన్నారు. అధికారులు, సిబ్బంది ముందు అనుమతి లేకుండా గైర్హాజరు కారాదని, వైద్య కారణాలపై సెలవుల్లో ఉన్న వారి కారణాలు సహేతుకంగా ఉన్నవి లేనివి పరిశీలించాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఎక్కువ సమయం ఎదురు చూసేలా చూడవద్దని, వారి దరఖాస్తులను మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

కార్యాలయం లోపల ఓపెన్ లాంజ్ లలో పచ్చదనం కొరకు మంచి మొక్కలు నాటాలని, ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యాలయ పరిసరాల్లో ఖాళీ ప్రదేశాల్లో వన మహోత్సవం క్రింద మొక్కలు నాటాలని, గ్యాప్ లన్ని భర్తీచేయాలని కలెక్టర్ అన్నారు.

క్యాంటీన్ పరిశీలించి వ్యాపారం ఎలా నడుస్తుంది, ఆర్థికంగా లాభాలు ఉన్నయా అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ లో టీ త్రాగి, కలెక్టర్ స్వయంగా డబ్బులను చెల్లించారు.

ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి కే. శ్రీనివాస రావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రోడ్లపై ప్రయాణిస్తే స్పష్టంగా వన మహోత్సవం ప్రభావం కనిపించేలా చర్యలు
- అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్ పై అధిక శ్రద్ధ వహించాలి
- బ్లాక్ ప్లాంటేషన్ లో చిన్నపాటి దట్టమైన అడవులను సృష్టించాలి
- ఆగస్టు మొదటి వారం నాటికి అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్ పూర్తి చేయాలి
- సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ పారిశుద్ధ్య నిర్వహణ
- కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల పని తీరుపై సమీక్షించిన జిల్లా కలెక్టర్




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూలై -15:**

జిల్లాలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల పనితీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు.

వన మహోత్సవం, పారిశుద్ధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, త్రాగు నీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, ఇందిరా మహిళా డెయిరీ, తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో స్థానిక సంస్థలు, మునిసిపాలిటీ ల ఆధ్వర్యంలో పరిపాలన సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు.

వన మహోత్సవం కార్యక్రమం క్రింద అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ లపై అధిక శ్రద్ద పెట్టాలన్నారు. జిల్లాలోని ప్రధాన రోడ్ల వెంబడి మొక్కలు నాటే ఆస్కారం చాలా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత సంవత్సరం అవెన్యూ ప్లాంటేషన్ పంచాయతీ రోడ్డు, ఆర్ అండ్ బీ రోడ్డు, పట్టణాలలో మేయిన్ రోడ్ల వెంబడి పెద్ద ఎత్తున జరగాలని అన్నారు.

జిల్లాలో రోడ్డు వైపు పిచ్చి మొక్కలు అధికంగా పెరిగాయని, వీటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్డు వెంబడి ఎత్తైన మొక్కలు నాటాలని అన్నారు. ఆగస్టు నెలలో జిల్లా రోడ్లలో ప్రయాణిస్తుంటే వన మహోత్సవం ప్రభావం స్పష్టంగా తెలిసేలా మార్పు తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి మండలంలో బ్లాక్ ప్లాంటేషన్ స్థలాలను ఫైనల్ చేయాలని, మియావాకీ పద్ధతిలో మొక్కలు నాటాలని, ప్రతి మండలంలో అటవీ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు మంచి మొక్కలు నాటాలని చిన్న అడవి లాంటి ప్రాంతాన్ని సృష్టించాలని అన్నారు.

బ్లాక్ ప్లాంటేషన్ లో ముఖ్య అతిథులు పాల్గొనేలా చూడాలని అన్నారు. బ్లాక్ ప్లాంటేషన్ కు రెగ్యులర్ వాటర్ సప్లై ఉండేలా చూడాలని అన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో కూడా 2 ఎకరాలలో అర్బన్ పార్క్ ఏర్పాటుకు స్థలాలను గుర్తించి, అక్కడ ఎటువంటి మొక్కలు నాటాలో ప్రణాళిక సిద్ధం చేసి నివేదిక అందించాలని కలెక్టర్ మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు.

జిల్లాలో ఆగస్టు మొదటి వారం నాటికి బ్లాక్ ప్లాంటేషన్, రోడ్ల వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ పూర్తి చేయాలని అన్నారు. ప్రతి మండలం పనితీరు పరిశీలించి బాగా పనిచేసిన మండలాలకు గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండటం చాలా కీలకమని అన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే అక్కడ తప్పనిసరిగా ఆయిల్ బాల్స్ వేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలు, భవిత సెంటర్ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల స్థానిక సంస్థల అధికారులు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. డెంగ్యూ కేసు నమోదైన పరిసర ప్రాంతాల్లో ఫీవర్ సర్వే చేయాలని, ఆ ప్రాంతంలో మరింత సమర్థవంతంగా పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని అన్నారు.

పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపాలిటీకి ప్రభుత్వం అందించే బడ్జెట్, ఆర్థిక సంఘం నిధుల నుంచి అవసరమైన పరికరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుద్ధ్యం, పబ్లిక్ స్పేస్, పచ్చదనం, టౌన్ ప్లానింగ్, స్పోర్ట్స్ పై పట్టణాలలో అధికంగా దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

డిసెంబర్ చివరి నాటికి ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న నీటి కాల్వలో పిచ్చి మొక్కల తొలగింపు, పూడికతీత పనులు ఉపాధి హామి క్రింద యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాట్లలో భాగంగా మధిర నియోజకవర్గం పరిధిలో 5 మండలాల్లో ఉపాధి హామీ పనుల క్రింద క్యాటిల్ షెడ్ ల నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మండలానికి లబ్ధిదారులను పశువుల పంపిణీ కోసం ఎంపిక చేయాలని, మొదటి విడతలో ప్రస్తుతం పశువులు ఉన్న వారిని మాత్రమే ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఇందిరా మహిళా డైయిరీ అంశంలో ఎక్కడైనా ఎటువంటి పొరపాట్లు చేయాలని చూసినా కఠినంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి మండలంలో జూలై చివరి నాటికి గ్రౌండింగ్ పూర్తి చేయాలని అన్నారు.


సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ అవెన్యూ ప్లాంటేషన్ క్రింద ఎత్తైన మొక్కలు మాత్రమే నాటాలని, ప్రతి మండలంలో అవెన్యూ ప్లాంటేషన్ క్రింద ఎన్ని మొక్కలు నాటుతున్నారు, ఎన్ని అందుబాటులో ఉన్నాయి, ఇంకా ఎన్ని ఎత్తైన మొక్కలు కావాలో ఎంపీడీవోలు రెండు రోజులలో రిపోర్ట్ అందించాలని ఆదేశించారు.

ప్రైవేట్ ఆస్పత్రులలో నమోదయ్యే డెంగ్యూ, మలేరియా కేసుల సమాచారం కూడా స్థానిక సంస్థలకు ప్రతిరోజు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ భవనాల పెండింగ్ ఆస్తి పన్ను వసూలు నోటీసులు జారీ చేయాలని అన్నారు.

ప్రజావాణి కార్యక్రమం ముగిసిన తర్వాత కన్వర్జేన్స్ సమావేశం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎక్కడా త్రాగునీటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం నేపథ్యంలో నీటి నాణ్యత పరీక్షలను రెట్టింపు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, డిఎంహెచ్ఓ డా. కళావతి బాయి, మున్సిపల్ కమీషనర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శుభాంశు శుక్లా భూమికి తిరిగొచ్చాడు..



భారత యువ వ్యోమగామి శుభాంశు శుక్లా తన అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించి భూమికి సురక్షితంగా తిరిగివచ్చాడు. ఈ వార్త దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తం అవుతోంది. శుభాంశు ల్యాండింగ్‌ను లక్నోలో ఉన్న ఆయన తల్లిదండ్రులు ప్రత్యక్షంగా వీక్షించారు. ల్యాండింగ్ సక్సెస్ అయిన క్షణంలో వారి ఆనందానికి అవధులు లేకపోయాయి. కుటుంబ సభ్యులంతా ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఈ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

**అంతరిక్షంలో 18 రోజులు**

శుభాంశు శుక్లా అమెరికాలో నిర్వహించిన ఓ ప్రయోగాత్మక అంతరిక్ష మిషన్‌లో భాగంగా ఇతర అంతర్జాతీయ వ్యోమగాములతో కలిసి మొత్తం 18 రోజులపాటు అంతరిక్షంలో గడిపారు. ఈ ప్రయాణంలో ఆయన అనేక కీలక శాస్త్రీయ పరిశోధనల్లో పాలుపంచుకున్నారు. అంతరిక్షంలో గడిపిన అనుభవం, మానవ శరీరంపై అంతరిక్ష ప్రయాణ ప్రభావాలు, పరిసరాల్లో ఉన్న సూక్ష్మ జీవుల అధ్యయనాలు వంటి అంశాలపై శుభాంశు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఆయన పరిశోధనలు భవిష్యత్తు అంతరిక్ష ప్రయోగాలకు ఎంతో ఉపయోగపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**తల్లిదండ్రుల ఆనందం**

అంతరిక్షానికి వెళ్లే సమయంలో శుభాంశు తల్లిదండ్రులు మిగిలిన భారతీయుల మాదిరిగానే గర్వంతో పాటు కాస్త ఆందోళనతో కూడిన భావోద్వేగాలను వ్యక్తం చేశారు. తమ బిడ్డ అంతరిక్షంలో ఉన్నంత కాలం వారి గుండెలు ముకు బిగించుకున్నట్లే ఉన్నాయని వారు తెలిపారు. అయితే శుభంగా భూమికి తిరిగొచ్చిన సందర్భంగా వారి కళ్లలో ఆనందభాష్పాలు కనిపించాయి. ఇది ప్రతి తల్లిదండ్రులకూ గర్వకారణమైన క్షణం.

**భారత ప్రగతికి నిదర్శనం**

శుభాంశు శుక్లా వంటి యువత అంతరిక్ష పరిశోధనల వైపు అడుగులు వేయడం భారత విజ్ఞానపరమైన ప్రగతికి నిదర్శనంగా భావించవచ్చు. ఆయన సాధించిన ఈ విజయంతో యావత్ దేశం గర్వపడుతోంది. భవిష్యత్తులో మరిన్ని శాస్త్రీయ విజయాలను సాధించాలని శుభాంశుకు ఎంతో మంది శుభాకాంక్షలు తెలుపుతున్నారు. భారత యువతకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తారని ఆశిద్దాం.

## కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ఫైర్.. ఈ సారి బలైపోయిందో ఎవరో తెలుసా?



రాష్ట్రంలో ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్యేల్లో ముందుండే పేరు రెడ్డప్పగారి మాధవీరెడ్డి. కడప ఎమ్మెల్యే అయిన మాధవీరెడ్డి ప్రభుత్వ విప్ గా కూడా బాధ్యతలు నెరవేరుస్తున్నారు. ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచినా దూకుడుగా రాజకీయాలు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు ఎమ్మెల్యే మాధవీరెడ్డి. మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాల్లో వేదికపై తనకు కుర్చీ వేయాలని పట్టుబట్టి మరీ సాధించిన ఎమ్మెల్యే.. ఇతర వ్యవహారాల్లోనూ అంతే దూకుడుగా పనిచేస్తుంటారు. తాజాగా వార్డు సచివాలయ ఉద్యోగిపై ఆమె కన్నెర్రజేశారు. వందల మంది సమక్షంలో ఉద్యోగికి వార్నింగ్ ఇస్తున్న వీడియో వైరల్ గా మారింది.


'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా కడప నగరంలో పర్యటిస్తున్న మాధవీరెడ్డికి రేషన్ కార్డుల సమస్యపై కొందరు మహిళలు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాధవీరెడ్డి పక్కనే ఉన్న సచివాలయ ఉద్యోగిని ప్రశ్నించారు. దీనికి ఆయన వైసీపీ కార్పొరేటర్ ను అడగాలని చెప్పడంతో ఎమ్మెల్యే మాధవిరెడ్డికి చిర్రెత్తుకొచ్చిందని చెబుతున్నారు. ఓ ప్రభుత్వ ఉద్యోగి తన దృష్టికి వచ్చే సమస్యపై కార్పొరేటర్ ను అడగమనడం ఏంటని ఆశ్చర్యంతోపాటు ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. కార్పొరేటర్ కు బ్రోకర్ గా పనిచేస్తున్నావా? అంటూ ఉద్యోగిని నిలదీశారు. ప్రభుత్వం వద్ద జీతం తీసుకుంటూ బ్రోకర్ పనులు చేయొద్దు అంటూ మందలించారు. అయితే ఓ ఉద్యోగిని ఎమ్మెల్యే 'బ్రోకర్' అనడంపై విపక్షం మండిపడుతోంది. ఉద్యోగులను పట్టుకుని తిడతారా? అంటూ నిలదీస్తోంది.

ఈ విషయమై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ఎలా ఉన్నా, సచివాలయ ఉద్యోగిపై మాధవీరెడ్డి రియాక్షన్ చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేగా గెలిచిన నుంచి ఆమె లేడీ సివంగిలా పనిచేస్తున్నారని టీడీపీ నేతలు ప్రశంసిస్తున్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహనరెడ్డి సొంత జిల్లాలో టీడీపీ తరఫున ఆమె చేస్తున్న పోరాటంపై ఆ పార్టీ సోషల్ మీడియా నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో గన్నవరంలో మాజీ ఎమ్మెల్యే వంశీతో వివాదానికి దిగిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రాంతం ఏదైనా పార్టీ తరఫున మాధవీరెడ్డి ఎలాంటి భయం లేకుండా పోరాటం చేయడం విశేషంగా చెబుతున్నారు. ఇక తాజా వివాదంలో వైసీపీ విమర్శలను మాధవీరెడ్డి ఎలా అధిగమిస్తారో చూడాల్సివుంది.

## బోయింగ్ ఇంధన స్విచ్‌లపై ముందే హెచ్చరికలు

అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్‌లపై తీవ్ర చర్చ మొదలైంది. ఇటీవల వెలువడిన ప్రాథమిక దర్యాప్తు నివేదిక ప్రకారం.. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం రెండు ఇంజిన్లకు ఒక్కసారిగా ఇంధన సరఫరా ఆగిపోవడమేనని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్‌లపై అనుమానాలు మరింత బలపడ్డాయి. ఇదే సమయంలో యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన పౌర విమానయాన అథారిటీ ఇచ్చిన పాత హెచ్చరికలు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. మే 15న అంటే అహ్మదాబాద్ ప్రమాదానికి దాదాపు నలభై రోజుల ముందు.. బ్రిటన్ సీఏఏ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్‌తో పాటు ఐదు రకాల బోయింగ్ విమానాల్లోని ఇంధన షట్‌ఆఫ్ వాల్వ్ యాక్టువేటర్లపై భద్రతా నోటీసును జారీ చేసింది. అంతేకాకుండా, అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (%ఖీూూ%) విడుదల చేసిన ఎయిర్‌వర్తినెస్ డైరెక్టివ్ లోనూ ఇదే అంశంపై స్పష్టమైన హెచ్చరికలు ఉన్నాయి. దీనిని అనుసరించి ఆయా విమానాల్లో ఇంధన షట్‌ఆఫ్ వాల్వ్‌లను నిత్యం తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రమాదం జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాలపై భారత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కూడా స్పందించింది. దేశీయ ఎయిర్‌లైన్స్ వద్ద ఉన్న బోయింగ్ 787, 737 మోడళ్ల విమానాల్లో ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థలను పర్యవేక్షించాలని, పూర్తిస్థాయిలో తనిఖీలు జరిపి సంబంధిత నివేదికలను డీజీసీఏకు సమర్పించాలని ఆదేశించింది. ఈ ఘటనతో బోయింగ్ విమానాల భద్రతపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు మొదలయ్యాయి. అంతర్జాతీయ విమానయాన రంగం లోపాలను పట్టించుకొని తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ ప్రమాదం మరోసారి స్పష్టం చేస్తోంది. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ దుర్ఘటన గుర్తుచేస్తుంది.

## స్టోర్ లో దొంగతనం.. భారతీయురాలి అరెస్ట్.. అమెరికాలో ఇదో గుణపాఠం



అమెరికా ఇలినాయ్‌లోని మెక్‌హెన్రీ కౌంటీలో జరిగిన ఒక సంఘటన భారతీయులకు... ముఖ్యంగా అమెరికా వెళ్లే వారికి తీవ్ర హెచ్చరికగా నిలుస్తోంది. షాపింగ్ కోసం వచ్చిన ఒక మధ్యవయస్కురాలైన భారతీయ మహిళ అవ్లానీ జిమిషా.. టార్గెట్ స్టోర్‌లో సుమారు రూ. 1,08,000 (%వి%1,300) విలువైన వస్తువులను దొంగిలించడానికి ప్రయత్నించి అరెస్టయ్యారు. ఈ ఘటన అమెరికాలో చిన్న నేరంగా భావించబడే దుకాణాల దొంగతనం ఎంత తీవ్రమైన పరిణామాలను కలిగిస్తుందో స్పష్టం చేస్తోంది.

టార్గెట్ స్టోర్ భద్రతా సిబ్బంది జిమిషాను ఏడు గంటలకు పైగా అనుమానాస్పదంగా గమనించారు. ఆమె షాపింగ్ చేస్తున్న తీరుపై అనుమానం రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అరగంటలోపే ఒక మహిళా పోలీసు అధికారిణితో సహా ముగ్గురు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దాదాపు నాలుగు గంటల పాటు జిమిషాను విచారించారు. విచారణ సమయంలో జిమిషా పదేపదే క్షమాపణలు చెబుతూ, తన వద్ద డబ్బు ఉందని, కొనుగోలు మొత్తాన్ని వెంటనే చెల్లిస్తానని వేడుకుందని స్థానిక మీడియా తెలిపింది. అయితే పోలీసులు, ముఖ్యంగా మహిళా పోలీసు అధికారిణి ఆమె మాటలకు కించిత్ కూడా సానుభూతి చూపలేదు. ఒక దశలో ఆ అధికారిణి "మీ దేశంలో కూడా ఇలా దొంగతనాలు చేస్తారా?" అని ఘాటుగా ప్రశ్నించినట్లు సమాచారం. చివరికి, జిమిషాను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, చట్టపరమైన కేసు నమోదు చేశారు.

**ఒక్క దొంగతనమే... జీవితకాల నింద**

అమెరికాలో దుకాణాల దొంగతనాన్ని కేవలం చిన్న పొరపాటుగా చూడరు. ఇది ఒక తీవ్రమైన నేరం. ఈ నేరం నమోదైన తర్వాత అది జీవితాంతం మీపై మచ్చగా మిగిలిపోతుంది. మీరు క్షమించమని అడిగినా, డబ్బు చెల్లిస్తానని చెప్పినా అది చట్టపరమైన ప్రక్రియను ఆపదు.

**ఈ సంఘటన నుంచి భారతీయులు నేర్చుకోవాల్సిన గుణపాఠాలు:**

నేర రికార్డులు భవిష్యత్తులో వీసా పొందడంలో లేదా ఇమ్మిగ్రేషన్ స్టేటస్‌ను కొనసాగించడంలో తీవ్రమైన సమస్యలను సృష్టిస్తాయి. మీ పాస్‌పోర్ట్‌పై నేర చరిత్ర నమోదు కావచ్చు, ఇది అంతర్జాతీయ ప్రయాణాలపై ప్రభావం చూపుతుంది. వ్యక్తిగతంగా, సామాజికంగా తీవ్ర అవమానం ఎదుర్కోవాల్సి వస్తుంది. మీ ఒక్కరి చర్య దేశానికి కూడా అప్రతిష్టను తీసుకువస్తుంది.

**భారతీయులకు హెచ్చరిక:**

అమెరికాలో ఉన్నప్పుడు అక్కడి చట్టాలను గౌరవించడం అత్యవసరం. చిన్న తప్పిదంగా కనిపించేది కూడా అక్కడ తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. నిజాయితీగా జీవించడమే గౌరవప్రదం, అవమానాన్ని కొనితెచ్చుకోవడం కాదు.

## నిమిషా ప్రియా ఉరిశిక్ష వాయిదా విషయంలో 'బ్లడ్ మనీ' పాత్ర ఏంటి..?



కేరళకు చెందిన నిమిషా ప్రియాకు యెమెన్ లో ఉరిశిక్ష పడింది. ఆ దేశస్తుడిని హత్య చేసిన కారణంగా అక్కడి కోర్టు ఆమెకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును జూలై 16, 2025న అమలు చేసేందుకు అన్ని సన్నాహాలు చేశారు. కానీ చివరి నిమిషంలో ఆమె ఉరిశిక్ష వాయిదా వేసినట్లు అక్కడి ప్రభుత్వం భారత్ కు సమాచారం ఇచ్చింది. ఇందులో 'బ్లడ్ మనీ' కీలక పాత్ర ఉంటుందని వాదనలు వినిపిస్తున్నాయి. చివరి నిమిషంలో ఉరిశిక్ష వాయిదా పడడం చాలా అరుదుగా సంభవిస్తుంది. అసలు ఏంటి ఈ 'బ్లడ్ మనీ' ఇది ఎలా చెల్లిస్తారు. ఇది చెల్లిస్తే శిక్షల నుంచి బయటపడవచ్చా చూద్దాం..

**బ్లడ్ మనీ అంటే..**

క్షమాపణకు బదులుగా బాధిత వ్యక్తి కుటుంబానికి చెల్లించే పరిహారమే 'బ్లడ్ మనీ'. ఖురాన్ లో దీని గురించి ప్రస్తావన ఉంది. 'ఇస్లాంను నమ్మే వ్యక్తిని హత్య చేస్తే మరణించని కుటుంబానికి బ్లడ్ మనీ ఇవ్వాలి. ఒక వేళ బ్లడ్ మనీని భరించలేకపోయిన వారు వరుసగా రెండు నెలలు ఉపవాసం ఉండాలి' అని ఉంది. షిరియా చట్టంలో దీన్ని తీసుకువచ్చాయి కొన్ని దేశాలు. ముఖ్యంగా యెమెన్, సౌదీ అరేరబియా, ఇరాన్, పాకిస్తాన్ తో సహా కొన్ని ఇస్లామిక్ దేశాలు బ్లడ్ మనీని చట్టంగా చేశాయి. అంటే ఒక వ్యక్తి నేరం చేస్తే ఆ నేరం వలన బాధపడిన వారు, వారి కుటుంబ సభ్యులు కొంత మేర డబ్బును డిమాండ్ చేయవచ్చు. దీన్నే 'బ్లడ్ మనీ' అంటారు. షరియా చట్టం ప్రకారం బ్లడ్ మనీకి తలాల్ అబ్దో మెహదీ కుటుంబం అంగీకరిస్తే ఉరిశిక్ష నుంచి తప్పించుకోవచ్చు. ప్రభుత్వం నుంచి క్షమాభిక్ష కూడా దొరుకుతుంది. బ్లడ్ బనీ అనేది క్రీస్తు శకం, ఏడో శతాబ్ధం నుంచి వస్తుంది. ప్రధానంగా హింసకు గురయ్యే వారు దీని ద్వారా ఉప శమనం పొందుతారు. ఏడో శతాబ్ధం ఒంటెలు, జంతువులు, బంగారం లాంటివి బ్లడ్ మనీ కింద తీసుకునేవారు. కానీ ఇప్పుడు డబ్బులు తీసుకుంటున్నారు.

**ఇప్పటి వరకు బ్లడ్ మనీ కేసులు**

2017లో కేరళకు చెందిన ఏఎస్ శంకర్ నారాయణన్ తన ఇంట్లో ఎలక్ట్రీషియన్ గా పనిచేస్తున్న (బంగ్లాదేశ్ కు చెందిన) కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే యూఏఈ జైలులో 8 సంవత్సరాలు గడిపాడు. 2 లక్షల దిరామ్స్ (రూ. 47 లక్షలు) చెల్లించాలని అదేశాలు వచ్చాయి. కానీ అతని వద్ద అంత డబ్బు లేదు. దీంతో ఒక వార్తా పత్రికలో ఆయన దీన స్థితిని ప్రచురించడంతో విరాళాలు పెరిగాయి. దీనికి తోడు ఓమిరేట్స్ ఇస్లామిక్ బ్యాంక్ కొంత డబ్బు ఇవ్వడంతో బయటపడ్డాడు.

2017లోనే సౌదీలో అక్కడి వ్యక్తిని తెలంగాణ వాసి లింబాద్రి హత్య చేసిన ఘటనలో ఉరిశిక్ష పడింది. పదేళ్లు జైలులో ఉన్న తర్వాత స్థానిక వ్యాపార వేత్త సాయంతో తెలంగాణ రాజకీయ నాయకురాలు కవిత జోక్యంతో లింబాద్రి ఇంటికి వచ్చాడు.

2014లో కూడా ముగ్గురు భారతీయులు, ఒక సౌదీ వ్యక్తి కలిసి బిజినెస్ చేయగా.. వారి మధ్య వచ్చిన విభేదాలతో ముగ్గురు భారతీయలు సౌదీ వ్యక్తిని హత్య చేశారు. నిందితులైన ముగ్గురికి అక్కడి కోర్టు మరణ శిక్ష విధించింది. ఇందులో ఒక వ్యాపార వేత్త బ్లడ్ మనీ కింద రూ. 1.5 కోట్లు చెల్లించడంతో ముగ్గురు విడుదలయ్యారు. రియాద్ లో తన యజమాని మైనర్ కొడుకు ప్రమాదవశాత్తు హత్య చేసినట్లు రుజువు కావడంతో కేరళకు చెందిన అబ్దుల్ రహీమ్ కు కోర్టు ఉరి శిక్ష విధించింది. బాలుడి కుటుంబం రూ. 34 కోట్ల దియా (బ్లడ్ మనీ) చెల్లించడంతో మరణశిక్ష నుంచి తప్పించుకున్నాడు. మళయాలీ సమాజం విరాళంగా ఈ మొత్తాన్ని సేకరించింది. ఉరిశిక్షను తొలగించి 20 ఏళ్ల శిక్ష విధించారు. ఇందులో ఇప్పటికే అనుభవిస్తున్న కారాగార కాలం పరిగణలోకి తీసుకుంటే డిసెంబర్, 2026లో అబ్దుల్ రహీమ్ విడుదల కానున్నాడు.

## ఏడాదిలో వచ్చిన మేడే కాల్స్ ఇవే.. అన్నింటినీ సేఫ్ ల్యాండ్ చేసిన పైలట్లు..



గత నెల జూన్ 12న ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787-8 వీటీ-ఎన్‌బీ టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లో కూలిపోయింది. అహ్మదాబాద్ లోని బీజే మెడికల్ కాలేజ్ హాస్టల్ పై కూప్ప కూలింది. ఈ ప్రమాదంలో ప్లయిన్ లో ఉన్న 12 మంది సిబ్బంది 242 మంది ప్రయాణికుల్లో ఒక్కరు మాత్రమే బతికి బయటపడ్డారు. ఇక హాస్టల్ కు చెందిన 29 మంది కూడా మరణించారు. అందరూ అగ్నికి ఆహుతయ్యారు. ఈ ఘటన మొత్తం దేశాన్ని కుదిపివేసింది. డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి సగం కాలిన మృతదేహాలను అప్పగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదం భారత విమానాయాన చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోతుంది. ఇది ఉగ్రదాడి అని కొందరంటే.. మానవ తప్పిదం అని మరికొందరు.. లేదు లేదు టెక్నికల్ ఎర్రర్ అని ఇంకొందరు అన్నారు. ఏది ఏమైనా 253 మంది బతికి రాలేరు కదా.. కన్న వారి కట్టుకున్న వారికి జీవితకాలం కన్నీరే కదా..

మానవ రవాణా వ్యవస్థల్లో వాయు వ్యవస్థ అత్యంత కీలకమైంది. తక్కువ సమయంలో ఎక్కువ దూరం ప్రయాణించాలంటే ఇదొక్కటే మార్గం బినా మరోటి లేదు. అందుకే ఎక్కువ మంది దీన్నే ఆశ్రయిస్తుంటారు. దాదాపు విమానయానంలో ప్రమాదాలు తక్కువగానే జరిగాయి. కానీ ప్రమాదం జరిగినప్పుడల్లా వందల్లో ప్రాణాలు గాల్లోనే కలిసిపోతున్నారు. ఒక్కోసారి ఒక్కో ఫ్లయిట్ ఎక్కడ మిస్ అయ్యిందో కూడా తెలియకుండా మిస్టరీగా మిగిలిపోతుంది. విమాన ప్రమాదాలను తగ్గించేందుకు చాలా వరకు సైంటిస్టులు ప్రయత్నాలు చేస్తున్నారు. సాధ్యం అయినంత వరకు తగ్గిస్తూనే వస్తున్నారు. ఒక్కోసారి హ్యూమన్ ఎర్రర్, మరోసారి టెక్నికల్ ఎర్రర్ తో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల జరిగిన 787-8 విమానానికి సంబంధించి బ్లాక్ బాక్స్ ను పరిశీలించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కొన్ని విషయాలను వెల్లడించింది. 2024, జనవరి 1 నుంచి 2025, మే 31 వరకు విమాన, నౌకాయానికి సంబంధించి 11 మేడే కాల్స్ నమోదైతే అందులో దాదాపుగా అన్ని పైలట్ల చాకచక్యంతో తప్పాయని పేర్కొంది. చాలా వరకు సమస్యలను పైలట్లే పరిష్కరిస్తారని అర్థం అయ్యింది. మరి ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8కు సంబంధించి ఏం జరిగి ఉంటుంది. క్లుప్తంగా చెప్పుకంటే ఎయిర్ ఇండియా విమాన సర్వీసుల్లో కొన్ని లోపాలు ఉన్నట్లు డీజీసీఏ వెల్లడించింది.

**200కు పైగా ప్రాణాలను పొట్టన పెట్టుకున్న స్విచ్..**

బోయింగ్ విమానాలను నడిపే పైలెట్లు చాలా వరకు సీనియర్లు అయ్యుంటారు. ఎక్కువ కిలో మీటర్లు ఫ్లయింగ్ చేసిన వారినే వీటిని నడిపేందుకు ఆయా సంస్థలు ఎన్నుకుంటాయి. ఈ విమానం నడిపిన పైలట్ కు కూడా చాలా అనుభవం ఉంది. కాక్ పిట్ లో కూడా వీరి మధ్య సంభాషణలు జరిగినట్లు రికార్డు అయ్యింది. 787-8 బోయింగ్ విమానంలో ఇంజిన్లకు ఇంధనం సరఫరా చేసే స్విచ్ కటాఫ్ (బంద్)లో ఉన్నట్లు ఒక పైలట్ గుర్తించాడు. ఇది టేకాఫ్ అయిన క్షణాల్లో గుర్తించి మరో పైలట్ ను ప్రశ్నించాడు. తాను చేయలేదని కో పైలట్ చెప్పాడు. వెంటనే ఆన్ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇంజిన్ ఆగి ఆగి స్ట్రాట్ కావడంతో వేగం అందుకోలేక కుప్పకూలింది. సాధారణంగా ఈ స్విచ్ అంత తేలికగా కటాఫ్ కాదని టెక్నీషియన్స్ చెప్తున్నారు. కానీ ఈ ప్రమాదంలో హ్యూమన్ ఎర్రరా.. లేదంటే టెక్నికల్ ఎర్రరా అనేది ఇంకా స్పష్టతరాలేదు.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# ఫీడ్ బ్యాక్ కోసం

వైసీపీ అధినేత వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలకు కొద్దిరోజులు విరామం ఇచ్చి నేతలతో సమావేశం అవ్వాలని కోరుతున్నారు. నేతలతో సమావేశమై ముందు గత ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను పూర్తి స్థాయి విశ్లేషించడానికి సమయం వెచ్చించాలని నేతలు సయితం కోరుతున్నారు. గత ఐదేళ్ల పాటు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలు, తీసుకున్న నిర్ణయాలు వంటి వాటిపై గ్రౌండ్ లెవెల్ లో ఏం జరుగుతుందన్న దానిపై నేతల నుంచి విడివిడిగా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని కోరుతున్నారు. సమావేశాల్లో తాను చెప్పడమే కాకుండా, తాను చెప్పింది విని నేతలు వెళ్లే పనికి స్వస్తి చెప్పి వారికి మైకు ఇచ్చి మాట్లాడించగలిగితే చాలా వరకూ సమస్యలు పరిష్కారమవుతాయని సూచిస్తున్నారు.

**పర్యటనలను సక్సెస్ అవుతున్నాయంటే?**

జగన్ జిల్లాల పర్యటనలు సక్సెస్ అవుతున్నాయంటే అందుకు నేతలు, కార్యకర్తలు కారణం. ఎందుకంటే ఆంక్షలు పెట్టినా నేతలు, కార్యకర్తలు భయపడకుండా రోడ్డుపైకి వస్తున్నారంటున్నారు. అంత ఉత్సాహంతో పనిచేస్తున్న కార్యకర్తలు, నేతలు ఈసారి ఎన్నికలలో ఇచ్చే హామీలతో పాటు అధికారంలోకి వస్తే ఏం చేయాలన్న దానిపై జగన్ నుంచి క్లారిటీ వస్తే మరింత పార్టీకి హైప్ వస్తుందని చెబుతున్నారు. వాలంటీర్ల వ్యవస్థను జగన్ తీసుకు వచ్చి తప్పు చేశానని ఇంత వరకూ ఆయన అనలేదు.పైగా వాలంటీర్లను తొలగించడం అన్యాయమంటూ జగన్ అధికార టీడీపీ పై విమర్శలు చేస్తుండటంతో మళ్లీ అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తిరిగి తెస్తారా? అన్న అనుమానం కార్యకర్తల్లో ఉంది.

**ఎమ్మెల్యేలకు గౌరవం...**

వాలంటీర్లు తిరిగి వస్తే తాము పార్టీ కోసం కష్టపడినా ప్రయోజనం ఏముంటుందని పలువురు అప్పుడే ప్రశ్నిస్తున్నారు. అలాగే కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా ఎమ్మెల్యేలను కూడా ప్రజల్లో భాగస్వామ్యులను చేయగలిగేలా జగన్ పనితీరు ఉండాలని వైసీపీ నేతలు కోరుకుంటున్నారు. తమ చేత పంపిణీ చేయిచండంతో పాటు ప్రజలకు తమను దగ్గరకు చేర్చడం వంటి పనులను చేయగలిగితేనే ఈసారి గెలిచినా తగిన గుర్తింపు ఉంటుందని, లేకపోతే 2019 తర్వాత పరిస్థితి తిరిగి పునరావృతమవుతుందని, ఎన్ని లక్షల కోట్ల రూపాయలు బటన్ నొక్కి పంపిణీ చేసినా చివరకు ఎన్నికల సమయానికి అది ఏమాత్రం పనిచేయదని కూడా చెబుతున్నారు.

**కార్యకర్తలకు భరోసా...**

కార్యకర్తలకు ఈసారి తాను అధికారంలోకి వస్తే పెద్దపీట వేస్తానని, ప్రాధాన్యత ఇస్తానని జగన్ పదే పదే పలు సమావేశాల్లో చెబుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. అధికారంలోకి రాగానే తాము ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కార్యకర్తలకు ఏం చేయగలరన్న దానిపై కూడా క్లారిటీ ఉండాలని క్యాడర్ అభిప్రాయపడుతుంది. ఎమ్మెల్యేలతో పాటు క్యాడర్ ను కూడా సరిగా చూసుకుంటేనే గెలుపు సాధ్యమవుతుందని, ఈ నాలుగేళ్లు కూడా తాను చెప్పిందే విని వెళ్లాలని కాకుండా, వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని దాని ప్రకారం ముందుకు వెళితే మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చని, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. మరి జగన్ నేతల మాట వింటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# చీట్‌మీల్స్ బ్యాలెన్స్ చేసేందుకు..!



రోజూ ఒకేరకం ఫుడ్ తినడం చాలామందికి ఇష్టముండదు. డైట్ పాటిస్తున్న వాళ్లు కూడా అప్పుడప్పుడు రొటీన్ ఫుడ్ బదులు నచ్చిన తిండి తింటారు. ఒకటి రెండుసార్లు చీట్ మీల్స్ ఓకే. అయితే చీట్ మీల్స్ కి అలవాటు పడితే డైట్ ప్లాన్ కంటిన్యూ చేయడం కష్టంగా అనిపిస్తుంది. ఇలా జరగకుండా ఉండేందుకు న్యూట్రిషనిస్ట్ త్రిషా అగర్వాల్ చెబుతున్న టిప్స్ కొన్ని....

చీట్ మీల్స్ చేసిన తర్వాత తొందరగా ఆకలి వేయదు. అప్పుడు దాదాపు 16 గంటలు ఫాస్టింగ్ ఉండాలి. దాంతోమళ్లీ డైట్ ప్లాన్ ని కంటిన్యూ చేసేయొచ్చు.

చీట్ మీల్స్ తింటే ఇన్సులిన్ లెవల్స్ పెరుగుతాయి. అందుకే మరుసటి రోజు కూరగాయలు, ప్రొటీన్ ఎక్కువ ఉండేవి తినాలి. ఇలాచేస్తే ఇన్సులిన్ లెవల్స్ తగ్గుతాయి.

క్యాలరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉన్న ఫుడ్ చీట్ మీల్స్ ని బ్యాలెన్స్ చేస్తుంది. ఫైబర్ ఉన్న ఫుడ్ పొట్ట నిండుగా ఉన్న ఫీలింగ్ ఇస్తుంది.

చీట్ మీల్స్ లో ఎక్కువగా స్వీట్లు, ఫాస్ట్ ఫుడ్ చిప్స్ వంటివి ఉంటాయి. వీటిల్లో సోడియం, షుగర్ ఎక్కువ. ఈ రెండూ ఆరోగ్యాన్ని దెబ్బతీసేవే. వీటిని బయటికి పంపించడానికి రెండు లేదా రెండున్నర లీటర్ల నీళ్లు తాగాలి.

డైట్ ప్లాన్ లోని ఫుడ్ కంటే చీట్ మీల్స్ తిన్నప్పుడు ఎక్కువ క్యాలరీలు అందుతాయి.

ఈ అదనపు క్యాలరీలను కరిగించేందుకు వాకింగ్, రన్నింగ్ వంటి ఎక్సర్ సైజ్ లు చేయాలి.

# నట్స్ ను వేయించుకుని తినాలా? లేక నానబెట్టుకుని తీసుకోవాలా..?

## నట్స్ ముడి రూపంలో తీసుకుంటే పోషకాల నష్టం ఉండదు

## కానీ ముడి నట్స్ లో హానికారక బ్యాక్టీరియా

## శుభ్రంగా కడుక్కుని తీసుకోవచ్చు

## ఓవెన్ లేదా ఫ్రయర్ లో వేయించుకుని తినొచ్చు

పోషకాలకు చిరునామా నట్స్. బాదం, వాల్ నట్, జీడిపప్పు, వేరు శనగ ఇవన్నీ కూడా మంచి ప్రొటీన్ తో కూడినవి. ఆరోగ్యకరమైన కొవ్వులు వీటిల్లో ఉంటాయి. పైగా కార్బోహైడ్రేట్లు తక్కువ. ఫైబర్ కూడా ఉంటుంది. వీటిని మోస్తరుగా తినడం వల్ల బ్లడ్ షుగర్ పై ఎలాంటి ప్రభావం పడదు. నట్స్ లో మెగ్నీషియం, సిలీనియం, ఫాస్ఫరస్, విటమన్ ఈ ఉంటాయి. ముఖ్యంగా నట్స్ లో పాలీ అన్ శాచురేటెడ్, మోనో అన్ శాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. మార్కెట్లో రా నట్స్ తోపాటు, రోస్టెడ్ (వేయించిన) నట్స్ ను కూడా విక్రయిస్తున్నారు. వైద్యులు నానబెట్టి తినాలని సూచిస్తుంటారు. మరి ఎలా తీసుకోవాలి? అన్న సందేహం రావచ్చు.

నట్స్ ను వేయించడం వల్ల వాటి ఫ్లావర్ లో మార్పు వస్తుంది. మంచి వాసన, రుచి తోడవుతుంది. వాటిల్లో తేమ తగ్గిపోయి కరకరలాడతాయి. ముడి నట్స్ తో పోలిస్తే కొంచెం తేలిగ్గా జీర్ణమవుతాయి. అయితే, బరువు తగ్గాలని కోరుకునే వారు నట్స్ ను వేయించుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నట్స్ ను వేయించేందుకు కొంత నెయ్యి, నూనె వాడాల్సి వస్తుంది. అది బరువు పెరిగేందుకు కారణమవుతుంది. కనుక బరువు తగ్గాలని అనుకునే వారు నట్స్ ను నానబెట్టి తీసుకోవడం మంచిది. లేదంటే మైక్రోవేవ్ ఓవెన్ లో రోస్ట్ చేసుకుని తీసుకోవచ్చు.

ముడి నట్స్, వేయించిన నట్స్ లో పోషకాల పరంగా పెద్ద మార్పు ఉండదు. యాంటీ ఆక్సిడెంట్లు వేడి కారణంగా కొంత



తగ్గుతాయి. ముడి నట్స్ తో పోలిస్తే వేయించిన వాటి షెల్ఫ్ లైఫ్ (నిల్వ ఉండే కాలం) తగ్గుతుంది. రా నట్స్ లో హానికారక సాల్మోనెల్లా, ఈ కొలీ బ్యాక్టీరియాలు ఉంటుంటాయి. ఎందుకంటే సాగు సమయంలో భూమిపై పడుతుంటాయి. దాంతో మట్టిలోని బ్యాక్టీరియాతో కలుషితం అవుతుంటాయి. అలాగే కలుషిత నీటిలో పెరిగిన వాటిల్లోనూ బ్యాక్టీరియా ఉండొచ్చు. ఆల్మండ్స్, వాల్ నట్, పిస్తాలో సాల్మోనెల్లా ఎక్కువగా కనిపిస్తుంది.

నట్స్ ను బాగా వాష్ చేసి, మైక్రోవేవ్ ఓవెన్ లో లేదంటే సన్నని మంటపై ఆయిల్ లేకుండా రోస్ట్ చేసుకుని తినొచ్చు. లేదా ఫ్రయర్ లోనూ వేయించుకోవచ్చు. నట్స్ కు ఉప్పును యాడ్ చేసుకుని తినడం మంచిది కాదు. నీటిలో నానబెట్టి తీసుకోవచ్చు. దీనివల్ల జీర్ణపరమైన సమస్యలు ఎదురుకావు. ముడి నట్స్ నే తీసుకునేట్టు అయితే, వాటిపై బ్యాక్టీరియా పోయేందుకు శుభ్రంగా కడుక్కోవాలి.

# దోశ, ఇడ్లీ పిండిలో వంట సోడా వేస్తున్నారా..?

## వంట సోడా ఆరోగ్యానికి మంచిదేమీ కాదు

## మోతాదు మించి, దీర్ఘకాలం పాటు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు

## దీనికి బదులు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించడమే మేలు

బేకింగ్ సోడా, వంట సోడాను పదార్థాలను పులియబెట్టేందుకు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. కేక్ లు, మఫిన్లు, బ్రెడ్లు, కుకీలు అనే కాదు, దోశ, ఇడ్లీ పిండిని వేగంగా పులిసేలా చేసేందుకు బేకింగ్ సోడా వేస్తుంటారు. నిజమే సోడా అనేది వేగంగా పులిసేలా చేస్తుంది. అన్ని హోటళ్లలోనూ దీన్నే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. మరి ఈ బేకింగ్, వంట సోడా ఆరోగ్యానికి మంచివేనా..? అధిక మోతాదులో దీర్ఘకాలం పాటు వీటిని వినియోగించడం వల్ల అనర్థాలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**నష్టాలు..**

బేకింగ్ సోడాను అధికంగా ఉపయోగిస్తే బీపీ పెరుగుతుంది. ఎందుకంటే ఇందులో, వంట సోడాలోనూ ఉండేది సోడియం బైకార్బోనేట్. ఇది బీపీని పెంచే రసాయనం.

బేకింగ్ సోడాతో రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడుతుంది. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, అలెర్జిక్ రియాక్షన్ల రిస్క్ ఉంటుంది.

రోజువారీగా ఉపయోగిస్తే మూత్ర పిండాల వైఫల్యం ఎదుర్కోవాల్సి రావచ్చు.



సోడాలో ఎలాంటి పోషకాలు ఉండవు. ఇందులో ఉండే ఫాస్ఫారిక్ యాసిడ్ మన పొట్టలోని యాసిడ్ తో కలుస్తుంది. దీనివల్ల జీర్ణ సామర్థ్యం తగ్గుతుంది. పోషకాలను గ్రహించే సామర్థ్యం దెబ్బతింటుంది. ఆహారం సరిగ్గా జీర్ణం అవ్వకపోతే అది బలహీనతకు దారితీస్తుంది.

బేకింగ్ సోడాతో పాంక్రియాస్ ఇన్సులిన్ ను అధికంగా ఉత్పత్తి చేస్తుంది. దీంతో 15-20 నిమిషాల్లోనే రక్తంలో షుగర్ స్థాయి పెరిగిపోతుంది. దాన్ని ఇన్సులిన్ ఫ్యాట్ గా మారుస్తుంది.

సోడాలోని ఫాస్ఫారిక్ యాసిడ్ ఎముకలకు నష్టం చేస్తుంది. ఎందుకంటే సోడా వినియోగం వల్ల మన శరీరం క్యాల్షియంను గ్రహించే శక్తి బలహీనపడుతుంది. దీంతో ఆస్టియోపోరోసిస్ రిస్క్ ఏర్పడుతుంది.

**ప్రత్యామ్నాయాలు**

సోడా ఉప్పు వేసి పులియబెట్టడం అనేది మంచి విధానం కానే కాదు. దీనికి బదులు పిండి రుబ్బుకుని సహజంగా ఒక రాత్రంతా పులిసేలా చేసుకోవడం మంచి విధానం.

సాధారణ ఉప్పుతోనూ పిండి కొంత మేర పులుస్తుంది.

కేకుల కోసం అయితే గుడ్లు లేదంటే ఫ్లాక్స్ జెల్ ను ఉపయోగించుకోవచ్చు.

బేకింగ్ ఉత్పత్తుల కోసం అయితే ఈస్ట్ అనే రైజింగ్ ఏజెంట్ ను వాడుకోవాలి.

# పిల్లల కోసం విడాకులు తీసుకున్న నటి!





బాలీవుడ్ నటి ఛాహత్ ఖన్నా గురించి పరిచయం అవసరం లేదు. 'ది ఫిలిం', 'థాంక్యూ', 'ప్రస్థానం', 'యాత్రాస్' లాంటి చిత్రాలతో సుపరిచితమే. బుల్లి తెరపైనా అమ్మడు బాగా ఫేమస్. 'ఖుబూల్' హై వంటి సీరియల్ ఆమెకు అక్కడా మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. కెరీర్ పరంగా ఎలాంటి ఢోకాలేదు. కానీ వ్యక్తి గత జీవితంలో మాత్రం ఛాహత్ కూడా చాలా ఎదురుదెబ్బలే తిన్నది. 2006 లో భరత్ నర్సింగ్ ను వివాహం చేసుకుంది. కానీ ఆ బంధం ఏడాది కూడా నిలబడలేదు. పెళ్లైన నాలుగు నెలల్లోనే వీగిపోయింది. అటుపై 2013 లో ఫర్హాన్ మీర్జాను పెళ్లాడింది. కానీ ఐదేళ్ల కాపురం అనంతరం ఆ జోడీ కూడా విడాకులతో వేరైంది. అయితే రెండవ సారి విడాకుల విషయంలో ఛాహత్ ఖన్నా ఓ కొత్త కారణాన్ని రివీల్ చేసింది. ఆమె మాటలు ప్రకారం భర్తతో ఎలాంటి వివాదం లేకుండానే విడాకులు తీసుకున్నట్లు కనిపిస్తుంది. పిల్లల భవిష్యత్ కోసమే విడాకులు తప్ప మరో కారణం లేదంది. - నాకెప్పుడు సరైంది అనిపిస్తేనే చేస్తాను. దానికే కట్టుబడి ఉంటాను. ఏదైనా తప్పు అనిపిస్తే అలాంటి పని జోలికి వెళ్లను. ఎవరైనా తప్పు చేసినా ధైర్యంగా నిలబడి ప్రశ్నిస్తాను. ఆ ధైర్యం, తెగువ నాలో ఉన్నాయి. తప్పు విష యంలో ప్రపంచమంతా ఒక్క వైపు ఉన్నా? నేను మరోవైపు ఉంటాను. ఆ రకమైన నమ్మకం, ధైర్యం నాకున్నాయి. అలాంటి స్వభావం నాకు చిన్నప్పటి నుంచే అలవాటైంది. పిల్లల కోసం ఎక్కువగా లోచిస్తాను. అలాగే వివాహ బంధం ఎంత బలంగా ఉందన్నది చూసుకుంటాను. సరిగ్గా లేని బంధంలో కొనసాగకూడదు అన్నది నా అభిప్రాయం. ఎందుకంటే పిల్లల కంటే ఏదీ ఎక్కువ కాదు. మనకంటే ఎక్కువగా పిల్లలు ప్రభావితం అవుతారు. అది కలిగించే నష్టం మనకు తెలియకుండానే జరిగిపోతుంది. వారు పెద్దాయ్యాక వారి స్నేహితుల నుంచే ఇలాంటి విషయలు మనకు తెలుస్తాయి. అందుకే కుమార్తెల కోసం కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పలేదని-తెలిపింది.

**వైవాహిక పుకార్ల మధ్య నుస్రత్ జహాన్ గ్లామరస్ లుక్‌తో తలదా చుకుంది**



**కావ్య కళ్యాణ్‌రామ్ సంతోష కరమైన దృశ్యాన్ని పంచు కున్నారు**

# తెలుగు కొత్త కుర్రాడితో దుల్కర్ సల్మాన్ సినిమా!



మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ తెలుగులోనూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. చేసిన సినిమా బంగారమే అవుతుంది. 'లక్కీ భాస్కర్' తో టాలీవుడ్ లో దుల్కర్ క్రేజ్ రెట్టింపు అయింది. దీంతో మరిన్ని తెలుగు సినిమాలు కమిట్ అవుతున్నాడు. ప్రస్తుతం పవన్ సాదినేని దర్శకత్వంలో 'ఆకాశంలో ఒక తార' చిత్రం చేస్తున్నాడు. ఈసినిమాపై అంచనాలు బాగున్నాయి. పవన్ సాదినేని కి దర్శకుడిగా మంచి పేరుంది. అతడి సినిమాలు మినిమంగా ఆడేస్తుంటాయి. ఇంత వరకూ పవన్ సినిమాలు వైఫల్యం చెందింది లేదు.

ఈ నేపథ్యంలో దుల్కర్ ప్రాజెక్ట్ మరింత క్రేజీగా ఉంటుందని అంచనాలున్నాయి. అటు కోలీవుడ్ లో 'కాంత' అనే చిత్రంలోనూ నటిస్తున్నాడు. ఇలా రెండు భాషల్లోనూ దుల్కర్ బిజీగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో తాజాగా తెలుగులో మరో కొత్త ప్రాజెక్ట్ ఒకే చేసాడు. రవి అనే కొత్త కుర్రాడితో ఓ సినిమా చేయడానికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ చిత్రాన్ని ఎస్ ఎల్ వీసీ సంస్థ నిర్మించడానికి ముందుకొస్తుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఆగస్టులో చిత్ర ప్రారంభోత్సవం ఉంటుందని సమాచారం. దుల్కర్ శైలికి తగ్గట్టు ఓ వినూత్నమైన కాన్సెప్ట్ తో ఈ సినిమా ఉంటుందంటున్నారు. ఎలాంటి అనుభవం లేని కొత్త కుర్రాడికి దుల్కర్ అవకాశం ఇవ్వడం అన్నది గొప్ప విషయం. సాధారణంగా ఈ రేంజ్ హీరోలు కొత్త హీరోలతో సినిమా చేయా లంటే ఆలోచి స్తారు. అదీ డెబ్యూ కి అవకాశం ఇవ్వాలంటే సవాల్ తో కూడిన పనే. అలాంటి సాహసం కొందరే చేయగలరు. అందులో దుల్కర్ కూడా చేరారు. మాలీవుడ్ లో కూడా కొత్త వాళ్లను ఎంకరేజ్ చేస్తూ సినిమాలు చేయడం దుల్కర్ కే చెల్లింది. అందుకే తండ్రికి తగ్గ తనయుడిగా ఇండస్ట్రీలో ఎదిగాడు. డాడ్ మమ్ముట్టి తరహాలో ఏడాదికి నాలుగు సినిమాలైనా రిలీజ్ చేయాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ సరైన కథలు, దర్శకులు కుదరకపోవడంతో సాధ్యపడలేదు. ఒకే బంగారం, సీతారామం సినిమాలతో దుల్కర్ తెలుగింట ఫేమస్ అయిన సంగతి తెలిసిందే. అటుపై రిలీజ్ అయిన లక్కీ భాస్కర్ తో తెలుగు నటుడిగా అభిమానులు భావిస్తున్నారు.